

ఆదివారం
2 జూన్, 2024
వార్త
గొప్పలు జాస్తి..
ఉపాధి నాస్తి!

## ఎన్టీఆర్ జోడీగా

# కియారా అద్వానీ?



ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ సినిమా ఈ ఏడాది ఆగస్టు నుంచి షూటింగ్ ప్రారంభం కానుంది. తాజాగా ఈ సినిమాకి సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త వినిపిస్తోంది. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వానీ నటించనున్నట్లు తెలుస్తోంది. కియారా అద్వానీ ఎన్టీఆర్ సరసన నటిస్తే ఆ క్రేజే వేరు.

ఈ సినిమాలో మరో హీరోయిన్‌కి కూడా స్కోప్ వుందని ఆ పాత్రలో మరో స్టార్ హీరోయిన్‌ను తీసుకునే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని తెలుస్తోంది. ఈ వార్తలో ఎంత వాస్తవం ఉందో చూడాలి మరి. ఎన్టీఆర్ అభిమానులు ఈ సినిమా అప్ డేట్స్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

**తారాతీరం**



# జూన్‌లో 'సత్యభామ' విడుదల!

సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ కాజల్ ఇప్పుడు అనేక భాషల్లో ఎన్నో చిత్రాలు చేసిన సంగతి తెలిసిందే. అలా తన కెరీర్‌లో ఆమె చేసిన 60వ సినిమా 'సత్యభామ'. దర్శకుడు సుమన్ చిక్కాల తెరకెక్కించిన ఈ చిత్రం విడుదల వాయిదా పడింది.

అయితే తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా జూన్ 7న గ్రాండ్‌గా విడుదల కాబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రంలో నవీన్ చంద్ర, ప్రకాశ్‌రాజ్, నాగినీడు, మొదలైనవారు కీలక పాత్రల్లో నటించగా శ్రీచరణ్ పాకాల సంగీతం అందించాడు. ఈ చిత్రాన్ని అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించారు. క్రైమ్ థ్రిల్లర్ కథతో దర్శకుడు సుమన్ చిక్కాల ఈ సినిమాను రూపొందించారు.

ఆదివారం వార్త

2 జూన్, 2024

## మంచి ముత్యాలు

ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక, దాన్ని మార్చాలనే కోరిక, ఈ రెండూ మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.

**- బెర్ట్రాండ్ రస్సెల్**

## విషయ విశేషం

ఎక్కడున్నా క్షేమంగా... 4

'సంఘీ'భావం....5

సోషల్ మీడియాతో అనర్థాలు

కవర్ స్టోరీ..6

గొప్పలు జాస్తి..
ఉపాధి నాస్తి!

అంతా మనలాగే...11

ఈవారం కవిత్వం..12

ఎలక్షన్ రిపోర్ట్!

కుప్పకూలుతున్న హెలికాప్టర్లు...14

ప్రొటీన్ డైట్....18

కథ.. 20

తండ్రి -బిడ్డలు

సాహిత్యం..23

చెరగని కవిత్వ సంతకం శేషేంద్ర

సిండరిల్లా..25

నీటి వంతెనలు చూడతరమా!...26

ఈశాన్య గది అద్దెకు ఇవ్వవచ్చా?..29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### 'ఇమ్యూన్' దాడి



లూపస్..మనకి మంచి చేయాల్సిన రోగనిరోధక వ్యవస్థ మనపైనే దాడిచేసే 'ఆటో ఇమ్యూన్' వ్యాధి. శరీరంపైన దద్దుర్లు రావడం నుంచి రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్ దాకా చాలా సమస్యలు వస్తాయి దీనివల్ల. ఈ సమస్య బాధితుల్లో 90శాతం మహిళలే ఉంటారు. అదీ భారతీయుల్లో దీని ప్రభావం మరీ ఎక్కువ. తాజాగా దీనికి మూలకారణమేంటో పసిగట్టారు ఫ్రాన్స్‌లోని పారిస్ సిటీ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు. మామూలుగా మగవారిలో ఎక్స్-వై క్రోమోజోములూ, మహిళల్లో ఎక్స్-ఎక్స్ క్రోమోజోములూ ఉంటాయని తెలుసు మనకు. కానీ ఆడపిల్లలు రజస్వల కాగానే రెండు 'ఎక్స్' క్రోమోజోముల్లో ఒకటి బలహీనపడుతుంది. ఇలా బలహీనపడ్డ క్రోమోజోము కొందరు మహిళల్లో నడివయసు తర్వాత మళ్లీ క్రియాశీలం అవుతోందట. అది అలా చురుకుదనాన్ని అందుకోవడం వల్ల 'టీఎల్ఆర్7' అనే జన్యువు ప్రేరణకి గురై రోగనిరోధక వ్యవస్థని అవసరానికన్నా ఎక్కువగా స్పందించేలా చేస్తోందట. మహిళల్లో లూపస్ సమస్యకి అవసరానికన్నా ఎక్కువగా స్పందించేలా చేస్తోందట. మహిళల్లో లూపస్ సమస్యకి ఇదే మూలమని ఈ పరిశోధన తేల్చింది. ఈ స్పష్టతతో రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్ వంటి సమస్యలకి మేలైన చికిత్స సాధ్యం కావొచ్చంటున్నారు శాస్త్రవేత్తలు.



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



# ఎక్కడున్నా క్షేమంగా..

**ప్రస్తుతం** వేసవి సెలవులు ముగింపు ల్లోకి వచ్చాయి. అయితే సెలవుల్లో పిల్లలకు ఏదో ఒకటి నేర్పించాలను కుంటూ చాలామంది అమ్మానాన్నలు సమ్మర్ క్యాంపుల్లోనో, ప్రత్యేక తరగతుల్లోనో చేర్పిస్తారు. అంత వరకూ బాగానే ఉంది కానీ వాళ్లను ఆ కాస్త దూరం పంపడానికే కొంచెం ఆలోచిస్తుంటారు. ఆ ఇబ్బంది లేకుండా నిశ్చింతగా ఉండా లంటే వాళ్లు ఎక్కడికి వెళ్లినా మనకు తెలిసేలా చేసే జీపీఎస్ ట్రాక్టర్ గ్యాడ్జెట్లను ప్రయత్నించొచ్చు. 'మ్యాప్ మై వరల్డ్ స్మార్ట్‌బ్యాగ్, స్మార్ట్ షూ, స్మార్ట్ వాచీ, ఎయిర్ ట్యాగ్ రిస్ట్ బ్యాండ్' అంటూ జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్)తో ఉండే రకరకాల వస్తువులున్నాయి. ఇంకా 'స్మార్ట్ కీ ఫైండర్ లొకేటర్ జీపీఎస్ ట్రాకింగ్ డివైజ్' పేర్లతో కీ చెయిన్లూ వచ్చాయి. పిల్లల దగ్గరున్న బ్యాగుకో, వేసుకున్న దుస్తులకో లేదంటే మెడలో చిన్న లాకెట్‌లానో వీటిని వాడుకోవచ్చు. వీటికి సంబంధించిన ఆప్‌ని పెద్దవాళ్ల ఫోన్‌లో వేసుకుని ఎక్కడున్నా పిల్లల జాడను చూడొచ్చు. అంతేకాదు, అత్యవసరమైతే పిల్లలు-వాళ్ల దగ్గరున్న గ్యాడ్జెట్ మీద బటన్ నొక్కితే వెంటనే ఆ సమాచారం పెద్దవాళ్లకు వెళ్లిపోతుంది. అనుకోకుండా ఏదైనా ప్రమాదంలో ఇరుక్కున్నా పెద్ద శబ్దంతో చుట్టూ ఉన్న వాళ్లకు వినిపించేలా మోగే అలారంతోనూ ఉంటాయీ కీ చెయిన్లు.



ఈ సేఫ్టీ గ్యాడ్జెట్లతో చిన్నారులు ఒంటరిగా ఏ దుకాణానికో, స్నేహితు ల్ని కలవడానికో బయటకు వెళ్లినా బెంగపడక్కర్లేదు. ఈతరం పిల్లల్ని ఫోన్ల నుంచి దూరంగా ఉంచడమన్నది కుదరని పని. పెద్దవాళ్లు ఎంత చెప్పినా, వద్దని వారించినా..ఆడుకోవడానికీ, నేర్చుకోవడానికీ అంటూ ఏదో ఒక కారణం చెబుతూ చిన్నారులు ఫోన్లూ, ట్యాబులూ పట్టుకుని కూర్చుంటారు. తీక్షణంగా స్క్రీన్ చూడటం వల్ల పిల్లల కళ్లకు ఇబ్బందే. తెర నుంచి వచ్చే కాంతి కంటి సమస్యల్ని పెంచుతుంది. ఆ సమస్యలకు చెక్ పెడుతూ మార్కెట్లో కొత్తగా 'మొబైల్ ఐ ప్రొటెక్టర్' గ్యాడ్జెట్లు వచ్చాయి. మైక్రోసెన్సర్లతో ఉండే ఈ డివైజ్ స్క్రీన్ డిస్టెన్స్ రిమైండర్‌గా పనిచేస్తుంది. దీన్ని ఫోన్‌కి పెట్టామంటే..చిన్నారులు ఫోన్‌కు తగినంత దూరం లేకపోతే అలారం వస్తుంది. ఏఐతో పనిచేసే ఈ గ్యాడ్జెట్‌పిల్లల స్క్రీన్ దూరాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ కంటికి రక్షణని ఇస్తుంది. ఎక్కువసేపు తెర ముందుండే పిల్లలకు ఇది బాగా అవసరమవుతుంది.

**ఫ్యాన్లకు, ప్లగ్‌లకు రక్షణ:** అప్పుడప్పుడే నడుస్తున్న పిల్లల్ని పట్టడం మామూలు విషయం కాదు. ప్రతీ వస్తువూ కొత్తగా, అన్నీ వింతగా అనిపిస్తూ బుజ్జాయిల్ని తెగ ఆకట్టుకుంటాయి. సోఫాలూ, మంచాలపైన కాస్త అందేలా ఉండే స్విచ్‌బోర్డులు, గిర్రున తిరిగే టేబుల్ ఫ్యాన్ల దగ్గరకూ వెళ్లిపోతుంటారు. ప్రమాదమని తెలియదు కాబట్టి వాటిల్లో చేతులు పెట్టడం లాంటివి చేస్తుంటారు. ఎంతసేపని మనం కనిపెట్టుకుని ఉంటాం. అందుకే మనం వేరే పనులు చేసుకుంటున్నా 'పిల్లలు ఏం చేస్తున్నారు' అన్న భయాలు ఉండకూడదను కుంటే రక్షణగా కొన్ని వస్తువుల్ని వాడుకోవచ్చు. 'ఫ్యాన్ సేఫ్టీ మెష్, ఎలక్ట్రికల్ ప్రొటెక్టర్ సేఫ్టీ ప్లగ్ కవర్' పేర్లతో దొరుకుతున్నాయివి. ముచ్చటైన బొమ్మలతో వచ్చే ఈ నెట్ కవర్లను టేబుల్ ఫ్యాన్లకూ, క్లిప్పుల్లాంటి బోర్డు కవర్లను ప్లగ్‌లకూ సులువుగా పెట్టేయొచ్చు. మామూలుగా ఉపయోగపడు తూనే పిల్లలకు రక్షణనీ ఇస్తాయివి. ఇంకా చిన్నారులు ఫోన్ ఛార్జర్, ఎలక్ట్రిక్ వైర్లలాంటివి నోట్లో పెట్టుకున్నా ఏమీకాకుండా వైర్ ప్రొటెక్టర్లూ ఉన్నాయి.

**భద్రంగా:** ప్రయాణాల్లో ఎక్కడికైనా వెళ్లినప్పుడు ఏదైనా బ్యాగు తీసుకుంటూనో, మరేదైనా పని చేస్తూనో ఒక్క క్షణం పిల్లల చేయి వదిలితే చాలు చటుక్కున ముందుకు వెళ్లిపోతారు. జనాలూ, వాహనాల మధ్య ఎటు వెళ్లిపోతారోనని కంగారొచ్చేస్తుంది. అలాంటప్పుడు 'చైల్డ్ కిడ్ వాకింగ్ అసిస్టెంట్ స్ట్రాప్ బెల్ట్, హ్యాండ్ బెల్ట్'ల్ని వాడొచ్చు. పిల్లల వీపూ లేదా చేయికీ చేయికీ కలిపి దీన్ని పెట్టుకున్నామంటే పిల్లలు గబగబా పరుగులు తీయకుండా మనదగ్గరే ఉంటారు. విహారాల్లో, రద్దీ ఉన్న ప్రదేశాల్లో బాగా ఉపయోగపడ తాయి. ఇంకా బైక్ మీద ఎక్కడికైనా పిల్లల్ని తీసుకుని వెళ్లినప్పుడు మామూలుగా కూర్చో పెట్టుకునే బదులు 'సేఫ్టీ వెహికిల్ బెల్ట్' పెట్టుకోవచ్చు. ❑



## 'సంఘీ' భావం



# సోషల్ మీడియాతో అనర్థాలు

ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఉపయోగపడాల్సిన సోషల్ మీడియా పక్కదారి పట్టడంతో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ వేదిక వల్ల మంచి కంటే చెడు ఎక్కువగా జరుగుతోంది. సమాజానికి హితవు పలకాల్సిన సోషల్ మీడియా ఇష్టారాజ్యంగా ట్రోలింగ్‌లు, తప్పుడు కథనాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. ఇటీవల జరిగిన ఘటనతో సోషల్ మీడియా వల్ల కలుగుతున్న అనర్థాలపై ప్రధానంగా చర్చ ప్రారంభమైంది. చెన్నై నగరంలోని ఒక అపార్ట్‌మెంటులో నాల్గవ అంతస్తులో ఏడెనిమిది నెలల పసికందు ప్రమాదవశాత్తు జారిపడింది. అయితే అక్కడ ఉన్న రేకుల వల్ల పసికందు జారుకుంటూ వచ్చి చివర్లో ఆగిపోయింది. ఈ దృశ్యాన్ని గమనించిన అపార్ట్‌మెంటు వాసులు, స్థానికులు శిశువును రక్షించేందుకు ప్రయత్నించారు. ఎంతోకష్టం మీద సురక్షితంగా కిందకు దింపగలిగారు. పసికందును కాపాడటానికి స్థానికులు చేసిన సాహసం మరవలేనిది. ఈ ఘటనలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అంత వరకు బాగానే ఉంది. అయితే కొందరు పసికందు తల్లిని టార్గెట్ చేశారు. చేతిలో సెల్‌ఫోన్ ఉంది కదాని ఇష్టం వచ్చినట్లు కామెంట్లు పెట్టడం మొదలు పెట్టారు. దీనికి తోడు రెండు ఎలక్ట్రానిక్ మీడియా ఛానెల్స్ ఫెల్యూర్ మదర్ అన్న శీర్షికతో పదేపదే స్టోరీని ప్రసారం చేయడం ప్రారంభించారు. ఏ పరిస్థితుల్లో పసికందు నాల్గవ అంతస్తు నుంచి జారిందన్న విషయం పక్కన పెట్టి తల్లి వైఖరే ఈ ఘటనకు కారణమని కొందరు నెటిజన్లు నిర్ధారణకు వచ్చేశారు. ఇక తల్లి ఆవేదనను ఎవ్వరూ పట్టించుకోలేదు. ఒక్కసారిగా తనపై వ్యతిరేక కామెంట్స్ రావడంతో తల్లి గుండె విలవిల్లాడింది. ఏ తల్లి కూడా తన చిన్నారిని పై అంతస్తు నుంచి కిందకు తోసే మనస్తత్వం ఉండదన్న కోణంతో నెటిజన్లు ఆలోచించలేక పోయారు. ఈ ట్రోలింగ్‌లు భరించలేని తల్లి రమ్య మానసికంగా కృంగిపోయింది. తన బాధను ఎవరితో చెప్పుకోవాలో అర్థం కాలేదు. చెన్నైలో ఉండలేక తన తల్లి నివాసం ఉండే కోయంబత్తూరుకు చేరుకుంది. అక్కడ కూడా ఇదే తంతు కొనసాగింది. ఇక ఆమెకు జీవితంపై విరక్తి కలిగి బలవన్మరణానికి పాల్పడింది. నెటిజన్ల తొందరపాటు చర్య వల్ల పసికందుకు తీరని అన్యాయం జరిగింది. పసికందుకు తల్లిని దూరం చేసి అభాగ్యురాలిగా మార్చింది. ఒక్కసారి కామెంట్ పెట్టబోయే ముందు తాము చేస్తున్నది సమాజానికి హితవుగా ఉందా లేదా అన్నది అలోచించాల్సిన బాధ్యత వారిపై ఉంది. అయితే అదేమీ పట్టించుకోకుండా ఒక తప్పు దొరికిందని బురదజల్లే ప్రయత్నం చేస్తే జీవితాలు తల్లకిందులు అవుతాయి. నెటిజన్లు తల్లి రమ్మపై చూపించిన అత్యుత్సాహం వల్ల నిండు ప్రాణం పోయింది. ఇప్పుడు ఎంత బాధపడినా చిన్నారికి తల్లిని తీసుకురాగలమా అన్న విషయాన్ని ఇలాంటి కామెంట్లు పెట్టిన నెటిజన్లు గ్రహించాలి. అయితే వారు మరో ఘటనపై బురద జల్లే పనిలో నిమగ్నం కావడంతో ఇలాంటి అంశాలపై దృష్టి సారించే ఓపిక ఉండదు. ప్రస్తుతం కృత్రిమ మేథ వచ్చిన తరువాత సోషల్ మీడియా పెద్ద తలపోటుగా మారింది. ముఖ్యంగా సెలబ్రెటీలు, ప్రముఖులు, నాయకులు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కావు. మాట్లాడిన మాటలు మార్చేస్తున్నారు. దృశ్యాలను అతికించి తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. సెలబ్రెటీలకే ఈ ఇబ్బందులు ఉన్నాయనుకుంటే రాజకీయ నాయకులకు కూడా ఈ బెడద తప్పడంలేదు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజకీయనేతలు మాట్లాడని విషయాలు వారు అన్నట్లుగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేసారు. ప్రముఖ ఛానెల్స్ వేయని బ్రేకింగ్‌లను తయారు చేసి వదిలారు. రాజకీయ నేతలు, ఛానెల్స్ యాజమాన్యాలు ఈ తప్పుడు ప్రచారంతో తమకు సంబంధం లేదని చెప్పేలోగా సమాజంలో ఇది నిజమేనేమో అన్న భ్రమ కలిగిస్తున్నారు. నిజం గడప దాటి వచ్చే సరికి అబద్ధం ప్రపంచం చుట్టి వస్తుందన్న సామెత సోషల్ మీడియాకు చక్కగా సరిపోతుంది. ప్రస్తుతం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కంటే సోషల్ మీడియా అతివేగంతో ప్రజల ముందుకు వెళుతోంది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా చట్టపరిధికి లోబడి పనిచేయాల్సి ఉంటుంది. అయితే సోషల్ మీడియా అలాకాదు. పిచ్చోడి చేతిలో రాయిలా ఎవరికి తగులుతుందో చెప్పలేని దుస్థితి. పదవ తరగతి కూడా చదవని వాడు న్యాయనిర్ణేతగా మారి కామెంట్స్ పెడుతుంటాడు. ఏదో ఒక ఘటనలో ప్రతి ఒక్కరూ వ్యతిరేక ట్రోలింగ్‌లను ఎదుర్కొంటారు. అలాంటి సమయంలో ఈ మీడియాను పట్టించుకోకుండా వ్యవహరించాలి. ఒక వారం రోజులు ఆగితే నెటిజన్లు మరో అంశంలో బిజీ అయిపోతారు. అలా కాకుండా వ్యతిరేక ట్రోలింగ్‌లను సీరియస్‌గా తీసుకుంటే సమస్యలు తప్పవు. ట్రోలింగ్ చేసిన వారు బాగానే ఉంటారు. అయితే వాటికి ప్రాధాన్యత ఇచ్చి ప్రాణాలు తీసుకుంటే తనపై ఆధారపడ్డ వారి పరిస్థితి ఏమిటని ఒక్కసారి ఆలోచించాలి. ముఖ్యంగా ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు ఆత్మీయులతోనో, స్నేహితులతోనో ఈ విషయం ప్రస్తావించి స్వాంతన పొందాలి. అప్పటికీ మనస్సు కుదుట పడకపోతే సైకాలజిస్టుల వద్దకు వెళ్లాలి. బాధ్యతారాహిత్యంతో కామెంట్స్ పెట్టే వారిని ప్రాసిక్యూట్ చేసే విధానం తీసుకురావాలి. ఉద్దేశ్యపూర్వకంగా కామెంట్స్ పెట్టే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలి. పోలీసులు వారిని ప్రశ్నించే పరిస్థితి తీసుకురావాలి. ఇలాంటి చర్యల వల్ల నెటిజన్స్‌లో జవాబుదారితనం పెరుగుతుంది. కామెంట్ పెట్టే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించే పరిస్థితిని చట్టం ద్వారా తీసుకుని రావాలి. అప్పుడే సోషల్ మీడియా వల్ల ప్రజలకు, సమాజానికి ప్రయోజనం కలుగుతుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# గొప్పలు జాస్తి.. ఉపాధి నాస్తి!

**'ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా..నిజం మరచి నిదురపోకుమా' అని ఎప్పుడో చెప్పారు మహాకవి శ్రీశ్రీ. భారతదేశ జనాభాలో దాదాపు మూడింట రెండువంతుల మంది 34ఏళ్ల వయసు కంటే తక్కువ వయసు గలవారు జనాభాలో 0 నుంచి 14 వయసుగలవారు 30.76శాతం ఉన్నారు. మరో 34.85శాతం మంది 15 నుండి 35 సంవత్సరాల మధ్యవయసుగలవారు అధికశాతం ఉన్నారని గణంకాలు చెబుతున్నాయి.**

రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చేందుకు..తాము దేశానికి/రాష్ట్రానికి రాబోయే ఐదుసంవత్సరాలకుగాను.. చేయబోయే/చేపట్టబోయే కార్యక్రమాలను క్లుప్తంగా తెలియజేసే ప్రణాళికా సరళిని మేనిఫెస్టోలంటూ..ఓటర్లను ఆకర్షించేందుకు ఎలక్షన్లకి ముందు ప్రచారంలో భాగంగా విడుదల చేస్తుంటాయి. దేశ/రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ముఖ్యంగా ఏడు అంశాలను పరిగణనలోకి తీసుకొని మేనిఫెస్టో రూపకల్పన జరుగుతుంది. అందులో ముఖ్యమైనవి.

విద్య, ఆరోగ్యం, ఇన్ఫ్రాస్ట్రక్చర్, కల్చరల్ రెలీజియన్

డెవలప్‌మెంట్, ఎంప్లాయిమెంట్ ఎకానమీ

వ్యవసాయం, పబ్లిక్ వెల్ఫేర్

ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆయా రాజకీయ పార్టీలు రూపొందించే మేనిఫేస్టోలను..ర్యాలీలు, రోడ్‌షోలు, నినాదాలు, ప్రసంగాలు, స్టార్ క్యాంపైనర్లషోలు, ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లటానికి ప్రయత్నాలు చేస్తాయి.

**కవర్ స్టోరీ**

**ఎం.వెంకటేశ్వర రావు**

ప్రతి ఓటరు ఎలక్షన్ల ముందు రాజకీయ పార్టీలు విడుదల చేసే ఈ మేనిఫెస్టోలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. ముఖ్యంగా చదువుకున్న ప్రతి పౌరుడు మేనిఫెస్టోలను అధ్యయనం చేసి, చదువురాని వారికి అర్థమయ్యేలా తెలియజేయాలి. అది విద్యావంతులు తమ కనీస బాధ్యతగా గుర్తెరగాలి. దేశాన్ని/ రాష్ట్రాన్ని ఆయాపార్టీలు ఏయే విధానాల ద్వారా, ఏవిధంగా అభివృద్ధిపథంలోకి తీసుకువెళ్లాలనుకుంటు న్నాయి? విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, ఉపాధివంటి ముఖ్యమైన అంశాలలో ఏపార్టీ ఏవిధానాలు ఉపయోగకరంగా ఉన్నాయో ఆలోచించాలి. అంతకుముందు పాలకులకంటే లాభదాయకంగా ఉన్నాయో లేదో తెలుసుకోవాలి. ఓటు పౌరుడి చేతిలో ఉన్న ఒకేఒక ఆయుధం. కాబట్టి దానిని సద్వినియోగం చేసుకుని తమకు కావాల్సిన పాలకులను ప్రలోభాలకు అమ్ముడుపోకుండా సామాన్యుడు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. రాజ్యాంగం ఈ దేశంలో పుట్టిన ప్రతి పౌరుడికి 18 సంవత్సరాలు వచ్చాక కల్పించిన ఓటుహక్కును దుర్వినియోగం చేయకూడదు.

ముందుకు చెప్పుకున్న ఏడు అంశాలను పరిగణనలోకి తీసుకొని తమ పార్టీని, అభ్యర్థులను గెలిపిస్తే..అది చేస్తాం, ఇది చేస్తామంటూ ఆచరణ సాధ్యంకానీ వాగ్దానాలతో

ఓటర్లను మాయ చేసే అంశాలను ..ప్రజలలోకి రకరకాల మాధ్యమాల ద్వారా తీసుకెళ్తున్నారు. అయితే ఈ మేనిఫెస్టోలలో అంశాల వారి వాగ్దానాలను ఓటరుకి తెలియజేయకపోతే..రేపు అధికారంలోకి వచ్చాక అమలు చేయ్యని ప్రభుత్వాలను నిలదీసే హక్కును కోల్పోతాం. అంతకు ముందు అమలులో ఉన్న పథకాలకి పేర్లు మార్చి, ఓటర్లను భ్రమింపచేస్తుంటాయి ఈ మేనిఫెస్టోలు. ముఖ్యంగా యువతకు అరచేతిలో వైకుంఠం చూపించే అందమైన గారడీలు చేరుస్తున్నారు. కానీ వాటికి తెలియని ఆంక్షలు నిబంధనలు నిగూఢంగా ఉంచుతున్నారు.



ఉదాహరణకు ఓ పార్టీ విద్యాభివృద్ధి కోసం ప్రతినెలా బడికి వెళ్లే విద్యార్థికి 1500 ఇస్తుందనుకుంటే..అందులో నిబంధనలు ఎలా ఉంటాయో చూద్దాం. స్కూల్ బాగోగుల కోసం..స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ అలాగే ఎస్‌టిఎఫ్ అంటే టాయిలెట్స్ మెయింటెనెన్స్ ఫండ్ లా కింద రూ 2వేలు, తీసుకుని, 1500 రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. దానికి మరో నిబంధన లబ్ధి పొందే విద్యార్థికి 75శాతం హాజరు ఉండాలి.

అలాగే స్కూళ్లలో ఎప్పటినుంచో అమల్లో ఉన్న మధ్యాహ్న భోజన పథకాలకి పేర్లు మార్పులు చేసి పోషకాహారం అంటూ ఎరచూపుతున్నారు.

రాజకీయ నాయకులు ఎంతగా దిగజారారంటే ఆఖరికి బడి పిల్లలకు అందించే కోడిగుడ్లపై కూడా తమ పార్టీ పేరు ముద్రించుకుంటున్నారు.



విద్యకోసం తల్లిదండ్రులు ఖర్చుపెట్టి డబ్బు తిరిగి ఇచ్చే పథకం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం. ఇందులోనూ ఎన్నో ఆంక్షలు, నిబంధనలు పొందుపరుస్తున్నారు. అలాగే విదేశీ విద్యకు సహాయం చేస్తామంటూ ఊదరకొట్టుకునే రాజకీయ నాయకులు అందులోనూ ఆశ్రిత పక్షపాతం చూపిస్తున్నారు. కే.జీ నుంచి పీ.జీ వరకు ఉచిత విద్య మరొక మోసపూరిత పథకం. ఓ పక్క ఇది అమలు చేస్తామని చెబుతూనే ప్రభుత్వ పాఠశాలల్లో వనరులు సమకూర్చకుండా ప్రైవేట్ పాఠశాలల విద్యావిధానాన్ని ప్రోత్సహిస్తూ ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. అందుకే ప్రైవేట్ పాఠశాలలు విపరీతంగా పెరిగి ఎల్కేజీకే లక్షల్లో



వసూలు చేస్తున్నారు. ప్రభుత్వాలు ప్రైవేట్ విద్యావిధానాన్ని అడ్డుకోకపోవడం శోచనీయం. కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యను అమలు చేయడంలో అన్ని పార్టీలు విఫలమవుతున్నాయి. ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం ద్వారా విద్యార్థులకు కట్టాల్సిన ఫీజులు కాలేజీలకే ప్రభుత్వం జమ చేస్తుంది. ఇందులోని అవకతవకల వల్ల, ప్రభుత్వ వైఫల్యాల వలన చివరికి విద్యపూర్తి చేసుకున్న విద్యార్థులకు ఫీజు బకాయిలు ప్రభుత్వాలు సరిగా చెల్లించకపోవడంతో ప్రైవేట్ కాలేజీలు విద్యార్థులకు సర్టిఫికెట్లు నిలిపివేసిన పరిస్థితులు అందరికీ విదితమే. మేనిఫెస్టోలో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలు, రకరకాల విశ్వవిద్యాలయాలు కాలేజీలు, మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తామని వాగ్దానాల్లో గుప్పిస్తున్నారు. మైనారిటీలకు ప్రత్యేక విద్యాలయాలు ఏర్పాటు చేస్తామని ఓ పార్టీ ప్రగల్భాలు పలుకుతుంటే..గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల తరహాలో నిర్వహిస్తామని, స్కిల్స్ పెంచే స్కిల్ యూనిర్సిటీ స్థాపిస్తామని మరో పార్టీ చెబుతోంది.

ప్రతి నియోజకవర్గాన్ని స్కిల్ హబ్‌గా మారుస్తామని చెప్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, చాట్, జిపిటి, వంటి ఆధునిక సాంకేతిక విద్యలను పాఠశాల స్థాయి నుండి అమలు చేస్తామని వాగ్దానాలు మేనిఫెస్టోలో గుప్పిస్తున్నారు. మెగా డీ.ఎస్సీ ద్వారా ఉద్యోగాల నియామకం, ప్రత్యేక జాబ్ క్యాలెండర్ వంటి వాగ్దానాల ద్వారా యువతను ఆకట్టుకునే అంశాలను మేనిఫెస్టోలో చేరుస్తున్నారు. లక్షల్లో ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించుకుంటున్నారు. ఆచరణలో వేలల్లో కూడా అమల్లోకి నోచుకోవటం లేదు.

కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న అనేక పథకాలను, రాష్ట్ర ప్రభుత్వాలు వాటికి రకరకాల పేర్లు పెట్టి..అవి తమ పథకాలుగా అమలు చేయడం శోచనీయం. ఆచరణ సాధ్యం కాని వాగ్దానాల్లో ముఖ్యంగా సంపూర్ణ మద్యపాన నిషేధం ఒకటి. యధేచ్ఛగా రాష్ట్ర ప్రభుత్వాలు మద్యంపై ధరలు పెంచుతూ ఆదాయ వనరులను పెంచుకునే అంశాల్లో మద్యపానం ముఖ్యమైనది. ఏ రాజకీయ పార్టీ కూడా మద్యపానం మీద ఆదాయాన్ని వదులుకోవడానికి ఇష్టపడదు. దీనివల్ల నిరుద్యోగ యువత ఉద్యోగం దొరకక ఏర్పడే

నిర్వీర్యతతో మద్యపానానికి, మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలని నాశనం చేసుకుంటున్నారు. రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక మద్యపానాన్నే ప్రధాన ఆదాయంగా మార్చుకుంటున్నాయి.

దీనివలన నిరుద్యోగ యువత, శ్రామిక కార్మికవర్గం నష్టపోతున్నారు. చిన్నచిన్న పిల్లలు కూడా మద్యపానం మాదకద్రవ్యాలకు అలవాటుపడుతున్నారు. ప్రభుత్వాలే మద్యం షాపులను నడపటం, అలాగే చికెన్ మటన్, కూరగాయల షాపులు కూడా నడపటం వింతల్లో వింత. ఖాళీగా ఉన్న 30లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం, యువతకు వికాసం కల్పిస్తామంటూ ఓ పార్టీ వాగ్దానం చేస్తే..మరోపార్టీ శాటిలైట్ సిటీలు, దేశవ్యాప్తంగా స్మార్ట్‌సిటీలు, కోట్లల్లో ఉద్యోగాల భర్తీ, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి ఎన్నెన్నో మౌలిక సదుపాయాల కల్పన, వస్తు తయారీ, స్టార్టప్ పరిశ్రమల ఏర్పాటు...పర్యాటకరంగాల్లో లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మేనిఫెస్టో రూపొందిస్తున్నారు. జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలు పోటీపడి ప్రకటిస్తున్న రాయితీలకు ఓటరు విస్తుపోతున్నాడు. ఓటర్ని ఆకాశంలో విహరింపజేసి వాళ్లను ఆకర్షించడానికి...



ఖరీదైన కార్లలో కాలు కింద పెట్టకుండా నిత్యం తిరిగే రాజకీయ నాయకులు ఎలక్షన్ సమయంలో నేలకు దిగి టీ తయారు చేయడం, దోశలు వేయడం, పేదల వైపే చూడటానికి ఇష్టపడిన నాయకులు ఓటరు తలలపై ముద్దులు పెట్టటం, అక్కున చేర్చుకోవడం.. వంటి వింత విచిత్ర ప్రవర్తనను చూసి ఓటరు వెర్రి చూపులు చూస్తున్నాడు.

**కోటలు దాటుతున్న మాటలు**

సంక్షేమంతోనే పాలన అని ఒక పార్టీ అంటే, మరో పార్టీ సంపద సృష్టించి పరిపాలిస్తాం అంటోంది. రత్నాలు, రత్నాలు-ప్లస్ ఒకరంటే, సూపర్ సిక్సులు, బౌన్సర్లు అని మరొకరు.. చేయబోయే మోసాలకు వాగ్దానాల ముసుగేసి మేనిఫెస్టోలను బైబిల్, భగవద్గీత, ఖురాన్ వంటి పవిత్ర గ్రంథాలతో పోలుస్తున్నారు.

యువతను మోసం చేయడానికి జాబ్ క్యాలెండర్ పేరుతో కాకిలెక్కలు.. మెగా డీఎస్సీల పేరుతో మెగా దగా చేస్తున్నారు. పై స్థాయి ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయకుండా వాటిని కింది స్థాయి ఉద్యోగాలకు తగ్గించి, ఖాళీలను కుదించి వేతనాలు తగ్గించటం శోచనీయం.

లక్షల మంది నిరుద్యోగ యువతకు ఐదు వేల రూపాయలు వేతన ఎరవేసి వారి ఉద్యోగ భవితవ్యానికి స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నారు. దక్కింది చాలన్నట్టు ఇంజినీర్లు డాక్టరేట్ పుచ్చుకున్నవాళ్లు ఈ ఉద్యోగాల్లో ఒదిగిపోవడం ఆశ్చర్యం.

రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో ప్రకటిస్తున్న సంక్షేమ పథకల వాగ్దానాల ముందు ఉద్యోగాలు కల్పించే దిగ్గజ ఐటీ కంపెనీలు నోరెళ్లపెడుతున్నాయి.

యువతకి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిం చడంలో వైఫల్యం చెంది, నిరుద్యోగ భృతి పేరిట పోటీలు పడి వాగ్దానాలు చేస్తున్నాయి రాజకీయ పార్టీలు. ఎంతో మంది యువత రాజకీయ పార్టీల మోసపూరిత వాగ్దానాలు నమ్మి ఎదురుచూపులు చూస్తూ వయోపరిమితి పెరిగి, ఉద్యోగ జీవితానికి, వైవాహిక జీవితానికి దూరమవుతున్నారు.

ఏ రాష్ట్రంలో చూసినా ఏముంది ప్రగతి? నిరుద్యోగులు పెరిగిపోతున్నారు. భాషలు వేరైనా భావం ఒక్కటే అన్నట్టు.. యువతకి అందని తాయిలాలు మేనిఫెస్టోలో మాయాజాలం చేస్తూ అరచేతిలో వైకుంఠానికి ద్వారాలు తెరుస్తున్నారు.

ఒక జాతీయ పార్టీ న్యాయపత్ర్ అంటే మరో పార్టీ సంకల్ప పత్ర్ అంటున్నాయి. ఒకరు యువ పారిశ్రామికవేత్తలకు రుణాలు, దేశాన్ని గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా తయారు చేస్తామంటూ మేనిఫెస్టోలో ప్రస్తావిస్తే- మరొకరు సైన్యంతో నియామకాలపై ప్రత్యేక దృష్టి, 30 లక్షల ఉద్యోగాల భర్తీ వంటి వాగ్దానాలు జెప్పిస్తున్నారు.

అధికార పార్టీపై నిరుద్యోగ సమస్య మీద దేశంలో 24 శాతం అసంతృప్తి వ్యక్తం అవుతోంది. దేశంలో సంపద పెరిగింది అని ప్రచారం చేస్తున్నారు. ఎవరిది పెరిగింది? పెరిగితే ఉద్యోగాలు భర్తీ ఎందుకు చేయడం లేదు? కొండలు నున్నగా ఉన్నాయి.. అన్నట్టు నమ్మిస్తున్నారు. సంపన్నుల సంపదే పెరుగుతుందన్నది వాస్తవం.

ఏ ప్రభుత్వం అయినా ఆఫ్ ది రిచ్, ఫర్ ది రిచ్, బై ద రిచ్ అన్నట్టే పని చేస్తున్నాయి.

ప్రతి సంవత్సరం కోటి 20 లక్షల మంది యువత డిగ్రీలతో బయటకు వస్తున్నారు. వాళ్లకి స్కిల్ డెవలప్‌మెంట్ అందించడంలో ప్రభుత్వాలు విఫలం అవ్వటం వల్లనే నిరుద్యోగపు శాతం పెరిగిపోతోంది.

నిరుద్యోగం మన దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్(ఐఎల్‌ఓ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్(ఐహెచ్‌డి) వారి లెక్కల





ప్రకారం యువతలో 83 శాతం మంది నిరుద్యోగులే. చదువుకున్న శాతం 2000 సంవత్సరంలో 35.7 శాతం ఉంటే; అది 2022కి 65.7 శాతం పెరిగింది. ఓటర్లలో 50 శాతం పైగా ఉన్న యువతను ఆకర్షించడానికి ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తామంటూ హామీలు ఇస్తూ మేనిఫెస్టోలు రూపొందిస్తున్నారు. కానీ అందులో చిత్తశుద్ధి ఎంత అనేది గత అనుభవాలు చెబుతున్నాయి. 2014లో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అధికారంలోకి వచ్చిన జాతీయ పార్టీ చెప్పింది. ఇప్పటికి ఆ లెక్కల ప్రకారం 20 కోట్ల ఉద్యోగాలు యూత్‌కి ఇచ్చి ఉండాలి. కానీ రెండు కోట్ల ఉద్యోగాలకు కూడా దిక్కులేదు. దేశ ప్రధానిని ఓ విలేకరి యువత నిరుద్యోగం గురించి అడగ్గా- మీ ఆఫీసు ముందు పకోడీలు వేసుకోవడం ఉద్యోగం కాదా? అన్నారు. దాని మీద పార్లమెంట్‌లో పెద్ద గొడవ జరిగింది. పార్లమెంటులో ప్రధాని మాటలను సభ్యులు సమర్థించటం, అందులో తప్పేముంది అనటం శోచనీయం. మరో ప్రధాన జాతీయ పార్టీ కేంద్రంలో ఖాళీ ఉన్న 35 లక్షలు ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పటంతో పాటు డిగ్రీ ఉన్నవాళ్లకి అప్రెంటిస్ షిప్ కింద లక్ష రూపాయలు ఇస్తాం అంటున్నారు. ఆచరణీయంగానీ వాగ్దానాలతో మేనిఫెస్టోల రూపంలో యువత భవితకు సంకెళ్ల వేస్తున్నారు అనడం నిస్సందేహం.

కానీ యువతరం ఎప్పుడూ ప్రభుత్వాలు తమకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరుకోదు. తమకు ఉద్యోగాలు కావాలి. ఉద్యోగావకాశాలు కల్పించమని మాత్రమే కోరుకుంటున్నారు.

## నిరుద్యోగ సమస్యకు కారణాలు

ప్రతి సంవత్సరం డిగ్రీలు పట్టుకొని బయట ప్రపంచంలోకి వస్తున్నవారి నిష్పత్తిలో ఉద్యోగాల నిష్పత్తి అమలు కావడం లేదు. విద్యావంతుల్లో కాలానికి తగ్గ స్కిల్స్ కొరవడుతున్నాయి. విద్యావ్యవస్థలో కాలానికి తగ్గ మార్పులు అంటే ఉద్యోగానికి, ఉపాధికి ఉపయోగపడే నైపుణ్య సాంకేతిక విద్య లేకపోవడం. ప్రభుత్వాలు ఉద్యోగపు ఖాళీలు చూపుచున్నారే తప్ప వాటిని భర్తీ చేయడంలో విఫలమవుతున్నారు. స్కిల్స్ డెవలప్‌మెంట్ కోర్సులు సెంటర్లు



తగినన్ని లేకపోవడం, అర్హతకు తగిన ఉద్యోగాలు రాకపోవడం... ఒక ప్యూను ఉద్యోగానికి లక్షలో దరఖాస్తులు వస్తే అందులో అధిక శాతం డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు వంటివారు రావడం యువతలో నిరుద్యోగతకు దర్పణం.

ప్రైవేట్ రంగ సంస్థలకు కావలసిన నైపుణ్య సాంకేతిక పరిజ్ఞానం డిగ్రీలున్న వారిలో లేకపోవడం. నానాటికీ పెరిగిపోతున్న జనాభా, దానితోపాటు విద్య పూర్తి చేసుకుని బయటికి వస్తున్నవారి సంఖ్య పెరిగిపోవటం. చిన్న పరిశ్రమలు కుంటుబడటం రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో యువతను ఆకర్షించే పథకాలు రూపొందిస్తున్నారే తప్ప అధికారం చేపట్టాక ఇచ్చిన హామీల విషయంలో నత్తనడక, పట్టించుకోకపోవడం ప్రధాన లోపం. ప్రభుత్వాలు ఇచ్చే నిరుద్యోగ భృతితో సంతృప్తి పడి విలువైన కాలాన్ని, అమూల్యమైన జీవితాన్ని సోమరితనంతో కుదించుకోవడం ఒక మానసిక దౌర్భల్యంలా నిరుద్యోగులు గుర్తించకపోవడం. 15 నుండి 30 సంవత్సరాల మధ్యగల యువకులలో నిరుద్యోగపు రేటు ఎక్కువగా ఉందని సర్వేలు చెబుతున్నాయి.

నిరుద్యోగం వలన విలువైన మానవ వనరులు వృథా అవుతున్నాయి. సాఫ్ట్‌వేర్ బూమ్ వచ్చినప్పటికీ నిరుద్యోగం తగ్గటం లేదు. ద్రవ్యోల్బణం వలన నిరుద్యోగ సమస్య నానాటికి పెరిగిపోవడం. యువకుల్లో నిరుద్యోగ సమస్య పెరిగి హత్యలకు, ఆత్మహత్యలకు పాల్పడుతూ మద్యానికి, మాదకద్రవ్యాలకు బానిసలు అవుతున్నారు.

## పరిష్కార మార్గాలు

యువత అధికంగా ఉన్న దేశాల్లో భారతదేశం ప్రథమ స్థానంలో ఉందని యుఎన్ఎఫ్‌పిఏ సర్వే చెబుతోంది. యువశక్తిని సరైన మార్గంలో వినియోగించుకోకుండా ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు నిర్లక్ష్యం చేస్తే యువతకు నిరుద్యోగం ఓ రోగంలా మారుతుంది. నిరుద్యోగం పెనుభూతంలా తయారై యువత ఆలోచనలను, స్కిల్స్‌ను నిర్వీర్యం చేస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది.

కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా వివిధ రంగాల్లో స్కిల్స్ సాధించే ప్రత్యామ్నాయ మార్గాలు వెదకాలి. ఇప్పుడు సాంకేతిక అభివృద్ధి ఎంతో స్పీడ్‌గా పెరిగిపోతోంది. సెల్‌ఫోన్‌లోనే సమస్తం లభ్యమవుతోంది. ఇంజినీరింగ్ చదివినవాళ్లు ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ వనరులు వినియోగించుకుంటున్నారు. వాళ్లను ఆదర్శంగా తీసుకోవాలి. శ్రీకాంత్ బొల్ల విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి స్వదేశానికి వచ్చి చిన్న పరిశ్రమలను ప్రోత్సహిస్తూ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఆత్మవిశ్వాసం ఉన్నవారి నుండి ఆత్మన్యూనత పారిపోతుంది. విలువైన కాలాన్ని నైపుణ్యత పెంచుకోవడంతో సద్వినియోగం చేసుకుంటే ఎన్నో స్టార్టప్ కంపెనీలు



మాటల్లో వాగ్దానాలు చేసి, అధికారంలోకి రాగానే చేతల్లో వాటిని తుంగలో తొక్కి ఐదేళ్ల కాలంలో కుబేరులు అవుతున్నారే తప్ప యువతను పట్టించుకోవడం లేదు. యువత రాజకీయ ప్రలోభాలకు మేనిఫెస్టోలో మాయాజాలానికి జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, ఉద్యోగాల భర్తీ వంటి దగా మాటలకు మోసపోకుండా తమలో ఉన్న ప్రాథమిక విద్యార్హతలకు క్రమం తప్పకుండా స్కిల్స్‌ను అప్డేట్ చేసుకోవాలి. కేవలం ఉద్యోగాలు వైపే కాకుండా ఉపాధి వనరుల వైపు ఆలోచిస్తే తామే కాకుండా తమతో పాటు ఎంతో మందికి ఉపాధి కల్పించే అవకాశాలు మన దేశంలో మెండుగా ఉన్నాయి. మోసపూరిత మాటల మేనిఫెస్టోలతో దగా చేస్తున్న నాయకులకు తమ ప్రతిభ ద్వారా ప్రభుత్వాలకు బుద్ధి చెప్పటానికి యువత నడుం బిగించాలి. ఓటును సద్వినియోగం చేసుకోవాలి.

వస్తాయి. ప్రభుత్వం, ప్రైవేట్ రంగాలు వాటిని ప్రోత్సాహించాలి. ఎన్నో విదేశీ సంస్థలు మన దేశంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయి. తదనుగుణంగా ఆయా రంగాల్లో ఆయా కంపెనీలకు తగిన విధంగా నైపుణ్యం పెంచుకోవాలి. వచ్చిన ఉద్యోగంలో నైపుణ్యాలు వృద్ధి చేసుకుంటూ ముందుకు వెళ్లాలి. వచ్చినదాంతో సంతృప్తి పడితే అభివృద్ధి వ్యక్తిగతంగాను, దేశ పరంగాను ఆగిపోతుంది.
విదేశాలకు వెళ్లి చదువుకుని అక్కడే మంచి ఉద్యోగాల్లో స్థిరపడుతున్న యువత.. స్వదేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగులకు దిశా నిర్దేశం చేయాలి. తమ వంతుగా చిన్న చిన్న స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించాలి. ప్రభుత్వాలు ప్రాథమిక విద్య నుండి ఉపాధి, ఉద్యోగాలకు ఉపయోగపడే స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన విద్య ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ప్రోత్సాహించాలి. అప్పుడే స్కిల్ గ్యాప్ తగ్గుతుంది.
ఎవరు ఎన్ని చెప్పినా రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికి యువతను వాడుకుంటూ, ఓట్లు దండుకుంటూ, మేనిఫెస్టోలో

"మీలో ప్రతివారు ఒక వీరాధివీరుడు కావాలి. విధేయత, సంసిద్ధత, పని మీద శ్రద్ధాసక్తులు.. ఈ మూడు మీలో ఉంటే మిమ్మల్ని ఏ శక్తీ అడ్డుకోలేదు" అని యువతను ఉద్దేశించి చెప్పిన వివేకానందుడి మాటలు నిజం చేసే శక్తి యువతరానికే ఉంది. ❑






# బంగారు ధూళి

అంటార్కిటికాలో ఉన్న 'మౌంట్ ఎరిబస్' ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన అగ్నిపర్వతం. ఇది బంగారు ధూళిని ఎగజిమ్ముతోంది. ఈ అగ్నిపర్వతం సముద్రమట్టానికి 12,448 అడుగుల ఎత్తున ఉంది. ఇది ప్రతిరోజూ ఎగజిమ్మే ధూళిలో దాదాపు 80గ్రాముల వరకు బంగారు ఉంటోంది. దక్షిణధ్రువ ప్రాంతంలో మంచుతో నిండి ఉన్న ఈ అగ్నిపర్వతాన్ని తొలిసారిగా 1841లో బ్రిటిష్ నావికాదళం అధికారి జేమ్స్ క్లార్క్ రాస్ కనుగొన్నాడు. అంటార్కిటికాలో 138 అగ్నిపర్వతాలు ఉన్నా, వాటిలో ఎరిబస్, డిసెప్షన్ ఐలండ్ అగ్నిపర్వతాలు అడుగున దాదాపు వెయ్యి డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో వెలువడే వాయువులు పైకి ఎగజిమ్మేటప్పుడు వెలువడే ధూళితో పాటు అడుగున దాదాపు వెయ్యి డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో వెలువడే వాయువులు పైకి ఎగజిమ్మేటప్పుడు వెలువడే ధూళితో బంగారం బయటపడటం చాలా అరుదని కొలంబియా యూనివర్సిటీలోని లామెంట్-డొహర్తీ ఎర్త్ అబ్జర్వేటరీ శాస్త్రవేత కోనర్ బేకన్ చెబుతున్నారు. ❑





# అంతా మనలాగే..

అచ్చంగా మనలానే ఉంటాయి. మనలానే మాట్లాడతాయి. మనలానే ఆలోచిస్తాయి. మనలానే సమాధానమూ ఇస్తాయి. అద్దంలో మనల్ని మనం చూసుకుంటున్నట్లుగానే అనిపిస్తాయి. ఈ వివరణ అంతా మన ప్రతిబింబాల గురించే..సూటిగా చెప్పాలంటే డిజిటల్‌క్లోన్స్ అన్నమాట. ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న ఏఐ పుణ్యమాని కొన్ని సంస్థలు ఇప్పుడు వ్యక్తిగత డిజిటల్ క్లోన్లను తయారుచేసేందుకు రెడీ అయిపోతున్నాయి. దాదాపు పాతికేళ్ల కిందట.. ఐశ్వర్యారాయ్ నటించిన 'జీన్స్'లో కన్నులతో చూసేదీ గురువా..పాటలో హీరోయిన్‌తోపాటు ఆమె ప్రతిబింబం అదేనండీ, డిజిటల్ రూపంలో కూడా కలిసి డ్యాన్స్ చేయడం చూసినప్పుడు భలే థ్రిల్లింగ్‌గా అనిపించింది కదూ. మనకీ అలా మారు రూపం ఉంటే బాగుంటుందని అప్పుడు ఎంతమంది అనుకున్నారో ఏమో కానీ ఇప్పుడది అందుబాటు లోకి వచ్చింది. అదే 'డిజిటల్ క్లోన్స్', హోలిస్టిక్ గురు, హెల్త్ గురుగా పేరున్న దీపక్‌చోప్రా కొన్నిరోజుల క్రితం తనని పోలిన డిజిటల్ క్లోన్‌ను తయారుచేయించుకుని ఓ కార్యక్రమానికి హాజరుపరిచి వార్తల్లో నిలిచాడు. అతనిలానే మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలనుకునే ఔత్సాహికులూ, అనుక్షణం ఉండే ప్రముఖులూ, తరచూ సమావేశాలకు హాజరయ్యేవారూ.. ఒక్కమాటలో చెప్పాలంటే సమయంతోపాటు పరుగులు తీసేవారికి ఈ డిజిటల్ క్లోన్స్ మంచి పరిష్కారాన్ని చూపిస్తున్నాయిప్పుడు.



**ఏంటీ డిజిటల్ క్లోన్**

ఇప్పటికే వర్చువల్, ఏఐ అందుబాటులో వచ్చాయి. వాటిల్లోనూ ఏరోజుకారోజు మార్పులు వస్తూనే ఉన్నాయి. ఈ రెండింటితో పోలిస్తే డిజిటల్ క్లోన్స్ ఎలా భిన్నం అంటే వర్చువల్ అనేది లేనిది ఉన్నట్లుగా చూపించి మాయ చేస్తుంది. ఇక, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)తో వ్యక్తిగత ఫొటోలను నచ్చినట్లుగా మార్చుకోవడం, కావాల్సిన సమాచారాన్ని క్షణాల్లో తెలుసుకోవడం, గేములు, వ్యాపారంలో భాగం చేసుకోవడం..ఇలా కృత్రిమ మేధస్సును తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారిప్పుడు. ఏఐ మోడళ్ల ఫ్యాషన్ ప్రపంచంలో రాణించడమూ తెలిసిందే. వాటన్నింటికీ అప్‌డేటెడ్ వర్షన్‌గా వచ్చిందే ఈ డిజిటల్ క్లోన్. అంటే..ఒక వ్యక్తికి సంబంధించిన డిజిటల్ ప్రతిబింబం అన్నమాట. ఈ క్లోన్ మనలానే కనిపిస్తూ..మనలానే ఆలోచిస్తూ..మనలానే సమాధానమిస్తుంది. ప్రముఖుల నుంచి బిజీ ఉద్యోగుల వరకూ వారి వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా తయారుచేస్తున్న ఈ డిజిటల్ క్లోన్స్‌తో ఎన్నో లాభాలు ఉన్నాయంటున్నాయి ఆయా తయారీ సంస్థలు. ఎలాగంటే..ఒక ఫిట్‌నెస్ గురు ఒకే సమయంలో అయిదారు గురికి శిక్షణ ఇవ్వాల్సి రావచ్చు. బిజీ వ్యాపారవేత్తలు లేదా ప్రముఖులు తమకున్న సమయం లోనే బోలెడు కార్యక్రమాలు లేదా సమావేశాలకు హాజరు కావడం తప్పనిసరి కావచ్చు. ఆ సమయాన్ని ఎంత పక్కాగా ప్లాన్ చేసుకున్నా ఏదయినా ఆటంకం ఎదురైనప్పుడు ఎలా అని కంగారుపడకుండా ఈ డిజిటల్ క్లోన్స్‌ను తెరమీదకు తీసుకురావొచ్చు అంటున్నారు.

**ఎలా తయారుచేస్తారు:** ఒక వ్యక్తికి డిజిటల్‌క్లోన్‌ను తీసుకొచ్చే ముందు ఆ సంస్థలు సదరు వ్యక్తికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు, మాటతీరు, ప్రముఖులైతే పాడ్‌కాస్ట్‌లు..ఇలా అన్నింటినీ అధ్యయనం చేసి, క్రోడీకరించి, ఆ సమాచారం అంతటినీ క్లోన్‌లో నిక్షిప్తం చేస్తాయి. దాంతో ఆ క్లోన్ రూపమే కాకుండా మాటతీరు, ప్రవర్తన, ఆలోచనావిధానం అన్నీ సదరు వ్యక్తిలానే ఉంటాయి. ఈ డిజిటల్ క్లోన్ దుర్వినియోగం కాకుండా తయారీసంస్థలు ముందుగానే ఫొటో ఐడెంటిఫికేషన్ వివరాలతోపాటు ఎన్నో జాగ్రత్తలూ తీసుకుంటాయి. ప్రస్తుతం డెల్ఫీ ఏఐతోపాటు ఆల్ట్, ఏఐ, కోచ్‌వోక్స్ ఏఐ వంటి సంస్థలు ఈ డిజిటల్ క్లోన్స్‌ను తయారుచేస్తున్నాయి.

# ఎలక్షన్ రిపోర్ట్!



**రాజకీయ** పొగమంచులో అంతా అస్పష్టంగా ఉంది.
రాజ్యం-మతం భుజాల మీద తుపాకి పెట్టి,
సామాన్యుల్ని కాల్చేస్తూ ఉంది!
సామాన్యులు మరో స్వాతంత్ర్య సమరంలోకి దూకారు.
యువత రాజ్యాంగాన్ని తమ గుండెల్లో దాచుకుని,
నిరసనే-నిజమైన దేశభక్తని చాటుతోంది.
కళ్లూ, ముక్కూ, చెవులు ఉన్నవారెవరూ
దేశం స్థితిగతుల్ని తెలుసుకోకుండా ఉండరు.
పాలకుల అబద్ధాల తూటాలకు జనం
సుళ్లు తిరిగి పడిపోతున్నారు.. అయినా,
లేచి, ఊపిర్లను నినాదాలుగా చేస్తున్నారు
ఈ ప్రభుత్వం కోతలదే తప్ప, చేతలది కాదని తీర్మానించారు.
సమైక్యత కోసం విద్యార్థుల శాంతి ప్రదర్శనలు
ప్రశాంతమైన సముద్రాల్ని తలపిస్తున్నాయి.
ప్రతీకార నిరంకుశ చర్యల్ని సైతం,
తమలో ఇముడ్చుకుని గంభీరమౌతున్నాయి.
జనం ఎండలకు కాదు, పౌరసత్వ చట్టానికి రగిలిపోతున్నారు
అవివేకపు చట్టాలు కాలిపోతున్నట్టు, దేశమంతా మండిపోతోంది.
అణిచివేసే అధికార బలమెప్పుడూ ప్రజాబలం ముందు దిగదుడుపే.
చరిత్రలో ఫెయిల్ అయినవారు గ్రహించుకోలేరు.
ఈ దేశ పౌరులకు పౌరసత్వమే లేకపోతే వీరు పాలకులెలా అయ్యేవారూ?
జ్ఞానమనేది తర్వాత, ముందు కాస్త ఇంగితమనేది ఉండాలి కదా?
పాలకులే ముందు తమ పౌరసత్వం నిరూపించుకోవాలి!
పాలకులే ముందు తమ డిగ్రీలు చూపించుకోవాలి!!
చదువుకున్నవారెవరూ విశ్వవిద్యాలయాన్ని ధ్వంసం చేయరు?
నా దేశంలో మనుషులంతా బతికే ఉన్నారు
మూఢత్వాన్ని ఛేదించుకుని,
మనుషులంతా ఒక్కటేనంటున్నారు!
దేశంలో విభజనల్ని, పాలకుల కుట్రల్ని దుయ్యబడుతున్నారు!!
సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని ఆకాంక్షిస్తున్నారు.
కాలాన్ని పదేళ్లు వెనక్కి నెట్టి మళ్లీ...
కొత్త ఊపిర్లు పీల్చుకుందామంటున్నారు.

– డాక్టర్ దేవరాజు మహారాజు

## ఈవారం కవిత్వం

# చెమట కొండలు

**ఎత్తైన** భవనాల మధ్య
అదొక మురికివాడ,
శ్రమజీవుల అడుగుజాడ,
ఎదగడానికి కాసింత మట్టి లేక
రాళ్ల మధ్యనే వారి జీవనం,
కొండపైదాకా మెట్లలా
ఇళ్లన్నీ అట్టబొమ్మల్లా పేర్చబడ్డాయి!



గుట్టపైన రాళ్లను పగలగొట్టి
వాటి మధ్య కన్నీళ్లను, పేదరికాన్ని కలిపి
వారంతా ఇళ్లు కట్టుకున్నారు,
ఏ గాలికి ఎప్పుడు కూలిపోతాయో
ఎవరి బతుకు తెల్లవారుతుందో తెలియదు!
నగరాన్ని తళతళలాడించి
ఆ మురికి నీటితోనే శుభ్రపడుతుంటారు,
ఇంటింటికీ తమ శ్రమను అందిస్తూ
చెమటై కరిగిపోతుంటారు!
నగరం మధ్యలో
చెదిరిన జుట్టులా ఉంది ఆ వాడ,
నగరం నడుస్తుంటే
దాని పాదాల కింద నలిగిన జీవితమిది!
పరిశ్రమల్లో, పాచిపనుల్లో
చెత్తకుప్పల్లో, చెట్లనీడల్లో
ఎక్కడ చూసినా వారి రెక్కల చప్పుడే!
వారి అలికిడి లేకపోతే
లోకానికి కదలిక ఉండదు,
వారి కదలిక లేకపోతే
కాలానికి నడక ఉండదు.

– పుట్టి గిరిధర్

# పుస్తక సమీక్ష



## ప్రభువుల చారిత్రక వైభవం

ఒరుగల్లు కమ్మ ప్రభువు ముసునూరి కాపయ్య, రేకపల్లి కమ్మ ప్రభువు ముసునూరి ప్రోలయ్యల చరిత్రలను అనేక శాసన సాహిత్య ఆధారాలతో వెలుగులోకి తెచ్చి ప్రామాణిక గ్రంథాలుగా ప్రచురింపచేసిన యువ చరిత్రకారుడు, రచయిత యడ్లపల్లి అమర్‌నాథ్ పరిశోధనా సత్కృషి అభినందనీయం. ఢిల్లీ సుల్తాన్‌ల మీద తిరుగుబాటు పోరాటాలలో విజయం సాధించిన, తెలుగుజాతి వీరయోధ ప్రభువుల సాహసికగాథలు కాలగర్భంలోకి కనుమరుగు కాకుండా ఆధారాలతో గ్రంథస్థం చేసి, శాసనాలతో, ఫొటోలతో రెండు చారిత్రక గ్రంథాలుగా అమర్‌నాథ్ వెలువరించారు. కమ్మ ప్రభువుల రాజవంశ చారిత్రక ప్రాభవంగా ప్రశంసనీయం. తెలుగుజాతిని ముసునూరి కాపయ్య, ప్రోలయ్య నాయకుల వంశం 1205 నుండి, 700 సంవత్సరాలు పరిపాలించిన కాలంలో ఢిల్లీ సుల్తాన్‌ల మీద తిరుగుబాటు పోరాటాలలో తుగ్లక్‌ల బారి నుండి తెలుగుజాతి విముక్తి ప్రదాతలుగా విజయం సాధించారు. ఆంధ్రదేశాధీశ్వర, ఆంధ్ర సురత్రాణ కాపయ్య, ఆంధ్రభూమండలాధ్యక్ష ప్రోలయ ప్రభువుల ఘనచరిత్ర ఈ రెండు పుస్తకాలలో పరిశోధనాత్మకంగా అమర్‌నాథ్ వివరించారు. నిక్షిప్తమైన సాహసగాధలను పరిశోధించి వారి పాలనలో బహమనీలతో రేచర్ల నాయకులతో పోరాటాలు రేకపల్లి, ఒరుగల్లు ప్రాధాన్యతను సవివరంగా ఈరెండు గ్రంథాలలో అక్షరీకరించారు. రచయిత అభినందనీయులు. **(ముసునూరి కమ్మ ప్రభువుల చారిత్రక వైభవం, రచన: యడ్లపల్లి అమర్‌నాథ్, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్)**

**– యర్రమిల్లి**

## మంచి పరిణత కవిత్వం



అభ్యుదయ కవయిత్రి పద్మావతి రాంభక్త 53 కవితలతో వెలువరించిన రెండవ కవిత్వపొత్తం 'మెతుకు వెలుగులు'. 'మోడైన బ్రతుకుచెట్టుకి/ పిడికెడు చిగురు జీవితాన్ని అద్దుకుంటూ/ ఆశల చమురు ఒంపుకుంటూ/ మీకు మెతుకు దీపాలు వెలుగులవుతాం' యిదీ సమాజానికి రైతన్నలు యిస్తున్న భరోసా. 'చోద్యం చూడాల్సిన క్షణం కాడిది/ అతడికి అండగా/ నిలబడాల్సిన ఘడియ ఇది' అంటూ సమాజానికి పిలుపునిస్తారు కవయిత్రి. 'కొన్ని ప్రాణాలకు ఊపిరిపోయడానికే కదా/ ఆమె నెలానెలా..ఎర్రని వరదై ప్రవహిస్తోంది/ 'అమ్మలు ఆడపిల్లను కనాలంటే వణికిపోతున్నారు' అంటూ స్త్రీల అవస్థలను, సమస్యలను, వ్యక్తిత్వాన్ని, ఆవేదనను..యిలా ఒకటేంటి బాల్యం నుండి బామ్మదాకా ఆవిష్కరించిన వైనం పద్మావతి కవితల్లో సాక్షాత్కరిస్తుంది. ఎక్కడా ఆవేశం వుండదు.. పరుషపదజాలం ఉపయోగించరు కవయితి. సౌమ్యంగా, సూటిగా ప్రతీకాత్మకంగా వ్యక్తపరిచిన తీరు అబ్బురపరుస్తుంది. మగాళ్ల అహంకార ధోరణిని ఒకవైపు చెప్తూనే స్త్రీల ఔన్నత్యాన్ని కవితల్నిండా వెదజల్లుతారు. స్త్రీవాద కవిత్వంలా తోచదు.. ప్రభోదాత్మకంగా అలరారుతుంది. 'మనిషిలోని అణువును చదవాలంటే..ఎన్ని వేలసార్లు మరణించి జన్మించి' వంటి అద్భుత పంక్తులు పాఠకుల్ని ముగ్ధుల్ని చేస్తాయి. కవితాప్రియులకు మంచి పరిణత కవిత్వం చదివామన్న తృప్తి కలుగుతుంది.

**(మెతుకు వెలుగులు, రచన: పద్మావతి రాంభక్త, వెల: రూ 100, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)**

**– రమణ వెలమకన్ని**

ఆంధ్రపద కవితాపితామహులు శ్రీతాళ్లపాక అన్నమయ్య వీరు వేంకటేశ్వర వైభవాన్ని 32వేల కీర్తనలతో స్తుతించినారని లోగడ తిరుపతి తిరుమల దేవస్థానమువారు రాగిరేకులు కాగితపు ప్రతులు మున్నగు వాటిని శోధించి 289 సంకీర్తనలను వెలికి తెచ్చినారు. ఇందుకు కొనసాగింపుగా తంజావూరు సరస్వతీ మహాలు వారి తాళపత్రగ్రంథాలయ విభాగంలో శ్రీవేంకటేశ



## అన్నమయ్య పదకవితా వైభవము

పదముగా లభ్యమైన 89 సంకీర్తనల సమాహారమిది. డా॥వేటూరి ఆనందమూర్తి, గంధం బసవశంకరరావు, పద్మభూషణ్ డా॥కె.ఐ.వరప్రసాదరెడ్డి (శాంతాబయోటెక్) సంపాదకత్వంలో, తిరుపతి తిరుమల దేవస్థానము వారు ప్రచురించినారు. పదసృజన, స్వరరచన రెంటినీ సమన్వయం చేస్తూ రచించిన వారిని వాగ్గేయకారులు అంటారు. ఆవిధంగా అన్నమయ్య తెలుగు వారికి లభించిన గొప్పభాగ్యము. 1940లో సర్వశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, వేటూరి ఆనందమూర్తిల శోధనలతో అన్నమయ్య కీర్తనలు మొట్టమొదటిసారిగా ప్రాచుర్యములోనికి వచ్చినవి. ఇది ఆ ప్రయత్నమునకు కొనసాగింపు. అన్నమయ శ్రీవేంకటేశుని, ఒక భక్తుడిగా, ప్రియునారాధించు ప్రేయసిగా, ఎన్నో విధముల తానై భగవంతుని సేవించినాడు. మరుగున పడిన మాణిక్యముల వంటి అన్నమయ్య కీర్తనలను తెలుగువారలకందించు ఈ ప్రయత్నమునకు తిరుమల తిరుపతి దేవస్థానమువారు, సంపాదకులు ఎంత యో అభినందనీయులు. **(శ్రీవేంకటేశపదములు, సంపాదకత్వం డా॥ వేటూరి ఆనందమూర్తి ప్రభృతులు, ప్రతులకు: తి.తి.దే)** **– కూర చిదంబరం**

సుచరిత పబ్లికేషన్స్ వారు ఈ పుస్తకం ప్రచురించారు. అంతరంగ ఆవిష్కరణ అనే చక్కటి ముందుమాటను మాల్యశ్రీ చింతూరి అందించారు. మొత్తం 10భాగాలుగా ఈ నవల సాగింది. సాంఘిక నవలగా, పర్యాటక యాత్రగ్రంథంగా పాఠకు

## 'నిరంతర యాత్రికుడు'



లు హాయిగా చదువుకొనేలారాసారు మూర్తి. రచయిత తన స్వీయ అనుభవాన్ని సామాజిక సమస్యలు, స్నేహం విలువలు యాత్ర చరితల కథనం పుణ్యక్షేత్రాల నుండి ప్రఖ్యాత రచయితల నివాసప్రాంతాలు, కలగలిపి అద్భుత కథనంగా అందించారు. వీరిదో ప్రత్యేకమైనశైలి, సుసంపన్నమైన శిల్పం, పాఠకుల్ని మంత్రముగ్ధులను చేసే కథాకథనం మనల్ని చేయిపట్టి చివరి కొసదాకా తీసుకెళుతుంది. టి.సి.కోరిన వ్యక్తి మరురోజు రమ్మంటే ఓ చోట కార్యకర్తను తెచ్చి జులుం ప్రదర్శించడం తరువాత రోజుల్లో సదరువ్యక్తులు కుక్క మృతదేహం వేయడం స్కూల్ ఆవరణలో మరోరోజు గాజుపెంకులు వేయడం వూరివాళ్ల అసహాయత ప్రదర్శించడం, ఒకరోజు ఆటోడ్రైవర్ 'వీరు' పరిచయం స్కూల్‌లో జరుగుతున్న పనులు అతనికి చెప్పడం, అకతాయి వెధవలకు అతను బుద్ధిచెప్పడం..ఇలా ఎన్నెన్నో సంగతులు సందర్శనలు ఒక్క చాప్టర్‌లోనే వుంటే మిగతా? అధ్యాయాలు మీరే చదవండి. **(నిరంతర యాత్రికుడు, రచన: మూర్తి కె.వి.వి.ఎస్. వెల: రూ 100, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్)** **– తంగిరాల చక్రవర్తి**





# కుప్పకూలుతున్న హెలికాప్టర్లు



**దేశాధినేతలు,** పాలకులు, ప్రముఖ రాజకీయ నాయకులు, బడావ్యాపారవేత్తలు, సినిమా ప్రముఖులు, కోటీశ్వర్లు.. ఇలాంటివారంతా తప్పనిసరిగా విమానాలు, హెలికాప్టర్లలో ప్రయాణం సాగించాల్సి ఉంటుంది. తక్కువ సమయంలో దూరప్రాంతాలకు, విదేశాలకు వెళ్లాలంటే వ్యక్తిగత హెలికాప్టర్లను వినియోగించడం సాధారణమే. అయితే ఈ హెలికాప్టర్లు, విమానాలలో ఏమాత్రం సాంకేతిక లోపాలు తలెత్తినా ప్రాణాలతో బయట పడడం కష్టమే. ఇటీవల ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ, ఇరాన్ విదేశాంగ మంత్రి హొస్సేన్ అమీర్‌బ్దొల్లహియన్‌లతో పాటు మొత్తం తొమ్మిదిమంది మరణించిన విషయం విదితమే. దీంతో హెలికాప్టర్ల ప్రమాదాల్లో మరణించిన వారిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

తెలుగురాష్ట్రాలకు సంబంధించి హెలికాప్టర్ ప్రమాదం అనగానే దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తుకువస్తారు. చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్తున్న ఆయన హెలికాప్టర్ 2009 సెప్టెంబరు 2న నల్లమల అడవుల ప్రాంతంలో కూలిపోయింది. దీంతో వైఎస్‌తోపాటు పైలెట్, కోపైలెట్‌లతో సహా ఐదుగురు దుర్మరణం చెందారు. గతంలో పలువురు మిలటరీ ప్రముఖులు, రాజకీయ నేతలు, ఇతర ప్రముఖులు ఛాపర్ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు.

**మిలటరీలో మరణించిన వారు**

1963 జమ్ముకాశ్మీర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో లెఫ్టినెంట్ జనరల్ రౌలత్‌సింగ్ సహా ఆరుగురు మిలటరీ అధికారులు మృతిచెందారు. 1997లో రక్షణశాఖ సహాయమంత్రి ఎన్‌వీఎన్ సోము, మేజర్ జనరల్ రమేశ్‌చంద్ర నాగ్‌పాల్ పయనిస్తున్న హెలికాప్టర్ అరుణాల్‌ప్రదేశ్‌లో తవాంగ్ సమీపంలో కుప్పకూలింది. మొత్తం నలుగురు మరణించారు.

1993లో ఒక మిలటరీ హెలికాప్టర్ భూటాన్‌లో కూలిపోయింది. ఇందులో భారతీయ తూర్పుప్రాంత ఆర్మీకమాండర్ లెఫ్టినెంట్ జనరల్ జమీల్ మొహ్మద్‌తో సహా 8మంది మిలటరీ అధికారులు మరణించారు. అధికారిక పర్యటనలో భాగంగా వారు భూటాన్‌కు వెళ్లారు.




ముఖ్యమంత్రులు, రాజకీయ నేతలు ఇలాంటి ప్రమాదాల్లో మరణించారు. 2011 ఏప్రిల్ 30న అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి దోర్జీఖాండూ పయనిస్తున్న హెలికాప్టర్ ప్రమాదానికి గురై ఆయనతో పాటు నలుగురు దుర్మరణం పాలయ్యారు.

2005లో హరియాణా విద్యుత్‌శాఖ మంత్రి, ప్రముఖ పారిశ్రామికవేత్త ఓపీజిందాల్, వ్యవసాయశాఖమంత్రి సురేందర్‌సింగ్ యూపీలోని షహరాన్‌పూర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందారు.

2002మార్చి 3న అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి కృష్ణాజిల్లాలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. ఆయన ప్రయాణిస్తున్న ప్రైవేట్ హెలికాప్టర్ కైకలూరులోని ఒక చెరువులో కూలిపోయింది.

## గతంలో తృటిలో బయటపడ్డారు

2015లో రావత్ ప్రయాణిస్తున్న ఛాపర్ ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో ఆయన నాగాలాండ్‌లోని దీమాపూర్ ఆర్మీక్యాంపునకు వెళ్తున్నారు. రంగపహార్ హెలిపాడ్ నుంచి చీతా హెలికాప్టర్ టేకాఫ్ అయిన కొద్ది సెకన్లలోనే కూలిపోయింది. ముక్కుభాగం నేరుగా నేలను ఢీకొట్టింది. అయితే ఆ సమయంలో రావత్‌తోపాటు అందులో పయనిస్తున్న ఒక కల్నల్, ఇద్దరు పైలెట్లు చాకచక్యంతో వ్యవహరించి ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆరేళ్ల తర్వాత అలాంటి ఛాపర్ ప్రమాదమే రావత్‌ను బలితీసుకుంది.





సంజయ్‌గాంధీ, బిపిన్‌రావత్

## సెబాస్టియస్ పినేరా-చిలీ మాజీ అధ్యక్షుడు

చిలీ దేశ మాజీ అధ్యక్షుడు సెబాస్టియన్ పినేరా..ఫిబ్రవరి 2024లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. దక్షిణ చిలీలోని ఓ చెరువులోకి హెలికాప్టర్‌పడటంతో ఆయన ప్రాణాలు విడిచారు. దక్షిణ చిలీలోని ఓ చెరువులోకి హెలికాప్టర్ పడటంతో ఆయన ప్రాణాలు విడిచారు. చిలీ రాజకీయాల్లో ఆయన చాలా కీలకపాత్ర పోషించారు.



మాధవ్‌రావ్ సింధియా

## మాధవ్‌రావ్ సింధియా

భారతదేశ ప్రస్తుతం విమానయానశాఖ మంత్రి జ్యోతిరాథిత్య సింధియా తండ్రి, ప్రముఖ కాంగ్రెస్ నేత మాధవ్‌రావ్ సింధియా 2001 సెప్టెంబర్ 30న జరిగిన హెలికాప్టర్ క్రాష్‌లో ప్రాణాలు విడిచారు. ఉత్తరప్రదేశ్ మెయిన్‌పూర్‌లో ఉండగా ఆయన ప్రయాణిస్తున్న ప్రైవేట్ బీచ్‌క్రాఫ్‌కింగ్ ఎయిర్ సీ90లో మంటలు చెలరేగాయి.

## మహమ్మద్ జియా ఉల్‌హక్- పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడు

పాకిస్థాన్ 6వ అధ్యక్షుడు జనరల్ మహమ్మద్ జియా ఉల్‌హక్..1998 ఆగస్ట్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. ఆయన ప్రయాణిస్తున్న సి-1998 ఆగస్ట్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. ఆయన ప్రయాణిస్తున్న సీ-130 హెర్క్యులిస్ ఎయిర్‌క్రాఫ్ట్ బహవల్‌పూర్ నుంచి గాలిలోకి ఎగిరిన కొంతసేపటికే కూలిపోయింది. ఇది ఇప్పటికీ ఒక మిస్టరీగానే ఉంది. హెలికాప్టర్‌లో లోపాల కారణంగా మరణించారా? లేక ఎవరైనా కావాలనే ఆయన్ని చంపారా? అన్నది ఇప్పటివరకు తెలియరాలేదు.

## రసీద్ కరామి-లెబెస్ మాజీ ప్రధాని

లెబనాన్ మాజీ ప్రధాని రషీద్ కరామీజీ 1987 జూన్ 1న జరిగిన ప్రమాదంలో మరణించారు. బైరూట్‌కు వెళుతుండగా హెలికాప్టర్‌లో ఉన్న బాంబు పేలుడు జరిగింది.

## సంజయ్‌గాంధీ మరణం

కాంగ్రెస్ నేత భారతదేశ మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ తనయుడు, కాంగ్రెస్ నేత సంజయ్‌గాంధీ 1980 జూన్ 23న జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఢీలీ సప్దార్‌జంగ్ ఎయిర్‌పోర్ట్‌లో విమానాన్ని నడుపుతుండగా అదుపు కోల్పోవడంతో అది క్రాష్ అయిపోయింది.

## ఇరాక్ మాజీ అధ్యక్షుడి మృతి

అబ్దుల్ సలామ్ ఆరిఫ్-ఇరాక్ మాజీ అధ్యక్షుడు

ఇరాక్ దేశ రెండో అధ్యక్షుడు అబదుల్ సలామ్ ఆరిఫ్ 1966 ఏప్రిల్ 13న జరిగిన ప్రమాదంలో మరణించారు. ఆయన ప్రయాణిస్తున్న ఎయిర్‌ఫోర్స్ ప్లేన్ బస్రా అనే ప్రాంతంలో క్రాస్ అయ్యింది. దీంతో ఆయన సోదరుడు అధ్యక్షుడు అయ్యారు.

ఇలా ప్రముఖనేతలు విమానప్రమాదాల్లో మరణించారు.

❑


## కార్టూన్లకు ఆహ్వానం


కార్టూని స్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.

sunmagvaartha@gmail.com

కథ

# తోడేలుకు బుద్ధి వచ్చింది

**గంగయ్య** వృత్తి గొర్రెల పెంపకం. ఊరిచివర అతని ఇల్లు. ఇంటిపక్కన ఖాళీస్థలం. అందులో చుట్టూ కంచె వేసి దొడ్డి ఏర్పాటు చేసి అందులో గొర్రెలను పెంచేవాడు. ఉదయాన్నే దగ్గర్లోవున్న అడవిలోకి గొర్రెల్ని తీసుకుపోయి పచ్చికవున్న చోటు మేపుకుని సాయంత్రం ఇల్లు చేరి దొడ్లో వాటిని వుంచేవాడు. ఇదంతా అడవిలో తోడేలు ఒకటి రోజూ గమనిస్తూ వుండేది. దానికి గొర్రెల మందను చూస్తే నోరూరుతుండేది. కానీ గంగయ్య జాగ్రత్తగా వాటిని కాపలాకాస్తుండడం వల్ల వాటిని తినాలన్న కోరిక తీరేదికాదు. ఆలోచించగా ఆలోచించగా దానికి ఒక ఉపాయం తట్టింది. తాను గొర్రెలమారి ఆ మందలో కలిసిపోతే రాత్రుళ్ల వాటిని మెల్లగా ఒక్కొక్క దానిని గంగయ్య కంటపడకుండా ఆరగించవచ్చు. కానీ తాను గొర్రెలాగా మారేదెలా? అని ఆలోచించింది. అడవిలో చెట్టుకింద తపస్సు చేసుకుంటున్న మునివద్దకు వెళ్లి 'అయ్యా! భగవంతుడెందుకో నాకు ఈ క్రూరమైన జన్మ యిచ్చాడు. నామీద నాకే రోత పుడుతున్నది. నన్ను మీరు గొర్రెగా మార్చండి. సాధువుగా బతుకుతాను' అన్నది. దానికాయన నవ్వి, 'ఇలాంటి కోరికలు సరైనవి కావు. అడగావు గనక అలాగే నిన్ను గొర్రెగా మారుస్తాను' అని, ముని దాన్ని గొర్రెగా మార్చాడు. ఉదయాన్నే అడవికి మేతకు వచ్చిన గొర్రెల మందలో అది తెలిగ్గానే కలిసిపోయింది. సాయంత్రం గొర్రెలమందతో తానూ దొడ్డికి చేరింది. అన్ని గొర్రెలు నిద్రలోకి జారగానే ఒక గొర్రెమీదకు దాడి చేసింది. కానీ దానికి వీలు కాలేదు. ఎందుకంటే దాడికి అవసరమైన గోళ్లు, కోరలు తోడేలుకు వుంటాయి కానీ, గొర్రెకుండవు కదా! ఆ సంగతి తెలిసొచ్చి తోడేలు నాలుక్కరచుకొంది. అంతలో మిగతా గొర్రెలు కోపంతో దానిమీద పడి దూరంగా నెట్టివేశాయి. తోడేలు పరిస్థితి చావుతప్పి కన్ను లొట్టపోయినట్టయింది. ఇలా రెండురోజులు గడిచాయి. ఫలితం లేదు. మూడవరోజు ఉదయం గొర్రెలు కొనే వారు వచ్చి గంగయ్యతో బేరాలు సాగించారు. రేపు వచ్చి డబ్బులు ఇచ్చి గొర్రెలు



తోలుకుపోతామని చెప్పి వెళ్లారు. తోడేలుకు ప్రాణాలు పైనే పోయాయి. తీసుకుపోయి వాళ్లేం చేస్తారో తోడేలుకు తెలుసు. ఆరోజు మేత మేసే సమయంలో ఎలాగో గంగయ్య కళ్లుగప్పి తప్పించుకుని మునివద్దకు చేరింది. 'అయ్యా! బుద్ధి గడ్డితిని కోరగాని కోరిక కోరాను. గొర్రెగా వుంటే గొర్రెను ఎలా తినగలను. ఆ మాత్రం ఆలోచించలేకపోయాను. ఆ గొర్రెలతో కలిసి యజమాని నన్నూ అమ్మబోతున్నాడు. బతుకుజీవుడా అని తప్పించుకుని వచ్చాను. మళ్లీ నన్ను తోడేలుగా మార్చండి. ఇంకెప్పుడూ ఇటువంటి కోరికలు కోరను మన్నించండి'. అంటూ ప్రాధేయపడింది. ముని దాన్ని తిరిగి తోడేలుగా మార్చి, 'ఆత్రగాడికి బుద్ధిమట్టు' అన్న సామెత నిజం చేశారు. మోసంతో గొర్రెల్ని చంపి తినాలనుకున్నావు. నాకు అప్పుడే నీ దుర్బుద్ధి తెలిసింది. నీకు తగినబుద్ధి చెప్పాలనే నీ కోరిక తీర్చడానికి అంగీకరించాను. ఆహారసంపాదన ధర్మబద్ధంగా చేయాలికానీ సునాయాసంగా ఆహారం సంపాదించాలనుకోకూడదు. మోసంతో జీవాల ప్రాణాలు తీయాలనుకోవడం తప్పు, పశ్చాత్తాపం పొందావు, మంచిదే. ఇకమీదట కష్టపడి ఆహారం సంపాదించుకో, వెళ్లు' అని తిరిగి గొర్రెను తోడేలుగా మార్చి పంపేశాడు.

– డా॥గంగిశెట్టి శివకుమార్

## బాలగేయం

### మొక్కలు నాటుదాం



మండుటెండల్లో ఇంట్లో
వుందాం
మామిడి పండ్లు
హ్యాపీగా తిందాం
సాయంత్రం గల్లీ
క్రికెట్ ఆడుదాం
ఐపీఎల్ మ్యాచ్‌లు చూద్దాం
వివేకానంద, గాంధీజీ
కలాం వంటి మహానుభావుల
జీవిత చరిత్ర
పుస్తకాలను చదువుదాం
చిన్నచిన్న మొక్కలు
నాటుదాం
నాటిన మొక్కలకు
నీళ్లు పోసి పెంచుదాం
పక్షుల కోసం
బయట నీళ్లు పెడదాం
విహార విజ్ఞానం
మిత్రులకు చెబుదాం
గొడవలతో కొట్లాటలు
మరచిపోదాం వేసవి సెలవుల్లో
ఎంజాయ్ చేద్దాం

**- ఫిజిక్స్ అరుణ్ కుమార్**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కావ్య,** కోదాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. పూర్వకాలంలో అబాకస్‌తో లెక్కలు చేసేవారట! వివరించగలరు.**

**జవాబు: కావ్య!** అరబిక్ అంకెలు వాడకంలోకి రాకముందు 'అబాకస్'తోనే లెక్కలు చేసేవారు. మొదటిసారిగా చైనా దేశీయులు దీనిని 'సువాపాన్' అని పిలుచుకునే వారు. 'అబాకస్'తో పోలికలు ఉన్నదానినే క్రీ.పూ.2400 ప్రాంతంలో బాబిలోనియాన్‌లోని ప్రజలు ఉపయోగించారని తెలుస్తోంది. ఒక రాతిపలక మీద ఇసుకరాశిని పోసి దాని మీద గీతలు గీచి, చిన్న చిన్న గులకరాళ్లను ఆ గడులలో వేసి లెక్కలు గణన చేసేవారు. దాని నుంచి 'అబాకీ' అనే కొత్త రకం లెక్కల గణింపు ప్రారంభమైంది. రెండు భాగాలుగా ఉండే దానిలో మీద నున్న పూసలకు రెండు, కింది వాటికి 5 పూసలు ఉండేవి. 'అబాకస్' అన్న పదం గ్రీక్ పదమైన అబాక్స్(లెక్కల బల్ల) నుంచి 1387లో ఆవిర్భవించింది.

**- ఎస్. వేంకటేశ్వర్లు,** కనిగిరి

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. జపాన్ భాష చాలా ప్రత్యేకత కలిగి వుంటుందని అంటారు. ఏమిటా ప్రత్యేకత?**

**జవాబు: వేంకటేశ్వర్లు!** ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో జపాన్ అగ్రస్థానంలో ఉన్నప్పటికీ ఆ దేశంలో వ్యాపార వ్యవహారాలన్నీ చేతిరాతల మీదే సాగడం విశేషం. జపాన్ భాషలో మూడు రకాల అక్షరమాలలు ఉన్నాయి. ఒక్కో అక్షర మాలలో నిత్యం ఉపయోగించే సంకేతాలు 1859 వరకు ఉంటాయి. వీటన్నింటినీ టైపు చేయడం ఖరీదైన వ్యవహారమే కాక సమయం కూడా ఎక్కువ పడుతుంది. అందుకే చాలా కంపెనీలు రాతకోతల కోసం ప్రత్యేకించి ఉద్యోగస్తులను నియమించుకుంటాయి.

# ప్రొటీన్ డైట్..

తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి

మానవ శరీరం నిర్వహించాల్సిన విధులకు, ఆరోగ్యకర జీవనానికి అనేకరకాల పోషకపదార్థాలు అవసరమవుతాయి. ప్రొటీన్లు జీవితానికి అత్యవసరం. చర్మం, వెంట్రుకలు, గోళ్లు, ఎముకలు, రక్తం, కార్టిలేజ్‌లలో అతిముఖ్యమైన భాగం ప్రొటీన్. ఎంజైమ్స్, హార్మోన్స్ ముఖ్యమైన బాడీ ప్రొటీన్లను తయారు చేసేందుకు శరీరం కూడా ఈ ప్రొటీన్లను వినియోగించుకుంటుంది. నిర్దిష్ట రసాయన ప్రక్రియలను ఎంజైమ్‌లు వేగవంతం చేస్తాయి. డైజెస్టివ్ ఎంజైమ్‌లు మనం తీసుకున్న ఆహారాన్ని ముక్కలుగా చేసి శరీర వ్యవస్థలోకి శక్తిని విడుదల చేసేందుకు తోడ్పడుతాయి. హార్మోన్లు సెల్యులర్ మెసెంజర్లుగా పనిచేస్తాయి. శరీరంలోని అన్ని రకాల కార్యకలాపాలను సమన్వయం చేస్తాయి. ఉదాహరణకు ఇన్సులిన్ మన శరీరంలో బ్లడ్‌షుగర్‌ను నియంత్రించడంలో తోడ్పడుతుంది. బయటి నుంచి చొచ్చుకువచ్చిన వాటి నుంచి కాపాడుకోవడంలో శరీరానికి యాంటిబాడీస్ అనే స్పెషలైజ్డ్ ప్రొటీన్లు తోడ్పడుతాయి. ఈ యాంటీబాడీస్‌ను తయారు చేసుకునేందుకు మన రోగనిరోధక వ్యవస్థకు ప్రొటీన్ అవసరం ఉంటుంది. ఆయా పదార్థాలను శరీరమంతటా తీసుకువెళ్లేందుకు శరీరం హిమోగ్లోబిన్ లాంటి ట్రాన్స్‌పోర్ట్ ప్రొటీన్లను తయారు చేసుకుంటుంది. ఇవి శరీరంలోని అన్ని కథలకు ఆక్సిజన్‌ను తీసుకువెళ్తాయి. అదేవిధంగా మరో రకం స్పెషలైజ్డ్ ప్రొటీన్లు కణాలకు వాటికి అవసరమైన విటమిన్లు, మినరల్స్‌ను చేరుస్తాయి. శరీరం ఆరోగ్యంగా ధృఢంగా ఉండటానికి దాదాపు 10,000 విభిన్న రకాల ప్రొటీన్‌లు అవసరం. పాల నుండి సంగ్రహించబడిన ప్రొటీన్‌ను సంపూర్ణ ప్రొటీన్‌గా పరిగణిస్తారు. ఎందుకంటే ఇది తొమ్మిదిరకాల ముఖ్యమైన ఎమైనో ఆమ్లాలను అందించేవనరు. శరీరానికి పెద్దమొత్తాలలో అవసరమయ్యే ఆహారంలో ఉన్న మూడుపోషకాలలో ప్రొటీన్ ఒకటి. ప్రొటీన్లు అమైనో ఆమ్లాలు అనే చిన్న సమ్మేళనాల వల్ల తయారవుతుంది. వందల అమైనో ఆమ్లాలు ప్రకృతిలో ఉన్నాయి. కానీ మానవ శరీరం వాటిలో 22ను మాత్రమే ఉపయోగిస్తుంది. శరీరం దానికి అవసరం అయిన అమైనో ఆమ్లాలును ఉత్పత్తి చేస్తుంది కాని తొమ్మిది అమైనో ఆమ్లాలును మటుకు ఉత్పత్తి మనం తినే దానివల్లే చేయవచ్చు. ఈ తొమ్మిది కావాల్సిన అమైనో ఆమ్లాలని ముఖ్యమైన అమైనో ఆమ్లాలు అని అంటారు. అవి ఆహారం నుండే ఉత్పత్తి అవుతాయి. శరీరం చురుకుగా ఉండాలన్నా రోగనిరోధక శక్తి ఉండాలన్నా అందుకు తగినట్లుగా ప్రొటీన్లు తప్పనిసరి. ఆహారంలో తగిన విధంగా ప్రొటీన్లు ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ప్రస్తుతం చాలామందిలో ప్రొటీన్ల లోపం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. తగినంత ప్రొటీన్లు లేక శరీరం నీరసించిపోతోంది. చాలామందికి ప్రొటీన్లపై అవగాహన ఉండడం లేదు. అవగాహన ఉన్నవారు సైతం తగినంత ప్రొటీన్లు తీసుకోవడం లేదు. శాఖాహారుల్లో 63శాతం మంది ప్రొటీన్ లోపంతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. అలాగని మాంసాహారుల్లో ప్రొటీన్లలోపం లేదని చెప్పలేం. 32శాతం మంది మాంసాహారుల్లో సైతం ప్రొటీన్లలోపం ఉందని గుర్తించారు. దేశవ్యాప్తంగా 73శాతం మందికి ప్రొటీన్ల లోపం ఉందని ఓ అధ్యయనంలో తేలింది. ఇక శాఖాహారుల్లో 84శాతం మంది, మాంసాహారుల్లో 65శాతం మంది పోషకాల కొరతతో ఇబ్బంది పడుతున్నారని ఐఎంఆర్‌బి నిర్వహించిన అండర్‌స్టాండింగ్ ప్రొటీన్ మైత్స్ అండ్ గ్యాప్స్ ఎమాంగ్ ఇండియన్స్ నివేదికలో వెల్లడైంది. ప్రొటీన్ల లోపం వల్ల ఏర్పడే బలహీనత, అలసట సంబంధిత వ్యాధులపై దేశంలో చాలామందికి సరైన అవగాహన లేదని నివేదిక తెలిపింది. ప్రపంచంలో ప్రతి ఐదుగురి పిల్లల్లో నలుగురు వారి వయస్సుకు తగ్గ సగటుబరువు కంటే తక్కువ బరువు గలవారు దాదాపు 15 కోట్లమందికి పైగా ఉన్నారు. అందులో 8కోట్లమంది పిల్లలు దక్షిణాసియా దేశాలకు చెందిన వారని యునిసెఫ్ నివేదిక చెపుతోంది. ప్రతిముగ్గురిలో ఒకరు ఏదో ఒక పోషకాహార లోపంతో బాధపడుతున్నారని గ్లోబల్ నేషనల్ రిపోరు-2016 పేర్కొంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 14.7 కోట్ల పాఠశాల పూర్వస్థాయి చిన్నారులు అయొడిన్, ఐరన్ లోపంతో బాధపడుతున్నారని యునిసెఫ్ నివేదిక తెలిసింది. భారతదేశంలో దాదాపు 47శాతం మంది పిల్లలు తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఐదేళ్లలోపు పిల్లల మరణాలలో భారతదేశంతో పోటీరాగల దేశమే లేదని లాన్సెట్ అధ్యయన నివేదిక చెప్పింది. శరీరంలో శక్తి విడుదలకు, పెరుగుదలకు, రక్షణకు పోషకాలు తోడ్పడతాయి. అవి తినే ఆహారం ద్వారా లభిస్తాయి. కార్బొహైడ్రేట్లు, ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు,



పీచుపదార్థాలు, నీరు, ఇవి భావి పౌరులుగా ఎదగాల్సిన నేటి బాలలకు ఈ పౌష్టిక ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది, తల్లిదండ్రులది. 'దేశంలో పాలు తాగకపోవడంతో 83 శాతం మంది ప్రొటీన్లలోపంతో బాధపడుతున్నారు. అధ్యయనంలో పాల్గొన్న 80శాతం మందికి ప్రొటీన్లపై అవగాహన ఉంది. అయితే, ఇందులో 68శాతం మందికి ప్రొటీన్ మన శరీరానికి ఎంత అవసరం అనే దానిపై స్పష్టమైన అవగాహన లేదు. 92శాతం మంది పాల ఉత్పత్తుల ద్వారా శరీరానికి అవసరమైన ప్రొటీన్ లభిస్తుందని భావిస్తున్నారు. అందులో కేవలం 32శాతం మంది మాత్రమే పాలను తాగుతున్నారు. 45 శాతం తల్లులు మాత్రమే తమ పిల్లలకు ప్రొటీన్స్ అందిస్తున్నారు. సాధారణంగా ఆరోగ్యవంతంగా ఉన్న ఏ వ్యక్తికైనా సరే శరీరంలో 1కిలో బరువుకు 0.8 నుంచి 1 గ్రాము వరకు ప్రొటీన్ అవసరం అవుతుందని..అంటే 70 కిలోల బరువున్న ఓ ఆరోగ్యవంతమైన వ్యక్తి నిత్యం 56 నుంచి 70 గ్రాముల వరకు ప్రొటీన్ తినాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో ప్రొటీన్ల లోపం సమస్య ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు అవసరం అయితే ప్రొటీన్ ట్యాబ్లెట్లు, పౌడర్‌ను వాడాల్సి ఉంటుందని అంటున్నారు.

## ప్రొటీన్ల లోపం నివారణ

ప్రొటీన్ల లోపం ఉన్నవారిలో కండరాలు, కీళ్ల బిగుసుకుపోయి ఉంటాయి. తలనొప్పి, గుండెల్లో మంట, గ్యాస్, మలబద్ధకం, ఆందోళన, విసుగు

**జీవనశైలి, శారీరక శ్రమతో సంబంధం లేకుండా, ఒక కిలో శరీర బరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ మన శరీరానికి అవసరం. భారతీయుల ఆహారం ఎక్కువగా బియ్యం, గోధుమలతో కూడినది కాబట్టి, శాఖాహారులు ప్రొటీన్ అధికంగా ఉన్న ఆహారాలను తింటూ, వారి డైట్ సమతుల్యంగా ఉండేలా చూసుకోవాలి. మనం రోజు మొత్తంలో తినే ప్రధానమైన ఆహారంలో 25శాతం ప్రొటీన్ ఉండాలి.**

చెందడం, నిద్రలేమి, తక్కువగా పనిచేసినా ఎక్కువగా అలసిపోయినట్లు అనిపించడం, గుల్లగా మారిపోయే ఎముకలు, బ్లడ్ షుగర్ తక్కువగా ఉండడం, వెంట్రుకలు బాగా



రాలిపోతుండడం, గోళ్లు, వెంట్రుకలు చిట్లడం, పగిలిపోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలున్నవారు డాక్టర్‌ను సంప్రదించి ప్రొటీన్ లోపానికి చికిత్స తీసుకోవాలి. ఎక్కువగా పప్పులు, మటన్, చికెన్, ఫిష్, చిక్కుడు జాతి కూరగాయలు, నట్స్ తదితర పదార్థాలను చేర్చుకోవాలి. దీంతో పొటీన్ల లోపం సమస్య నుంచి బయట పడవచ్చు. గుప్పెడు పల్లీలు తింటే వచ్చే ప్రొటీన్ల బలం పావు లీటరు పాలు, రెండుకోడిగుడ్లు తిన్నా కూడా



రాదు. పాలలోని ప్రొటీన్లు, నెయ్యిలోని కొవ్వు పదార్థాలు రెండూ ఇందులో లభిస్తాయని సూచిస్తున్నారు పోషకాహార నిపుణులు. పాలు, బాదంపప్పు, నెయ్యి తింటే లభించే పోషకపదార్థాలు కేవలం రోజూ పల్లీలు తినడం ద్వారా శరీరానికి అందుతాయి. శరీరంలో వేడిని పుట్టించే గుణం ఉన్న పల్లీలను ఏకాలంలో తిన్నా మంచిదే. ముఖ్యంగా వానాకాలం, చలికాలంలో వీటిని ఎక్కువగా తింటారు. అల్పాహారానికి ఒక గ్లాసు పాలు జోడించుకుంటే, నాణ్యమైన ప్రొటీన్లతోపాటు రుచిగా కూడా ఉంటుంది. రోజువారీ ఆహారంలో పనీర్ వాడటం వల్ల రోజుకు కావాల్సిన కనిష్ట ప్రొటీన్ల మోతాదును నిర్వహించుకోవచ్చు. ప్రొటీన్ల ఆహారం తీసుకుంటున్నప్పుడు క్రమం తప్పకుండా ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. దీనివల్ల జీవక్రియల అదనపు శ్రమ తగ్గుతుంది. ఇంకా శరీర ఉష్ణోగ్రత మామూలు స్థితిలోనే ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెప్పే సూచన. బాదం ప్రొటీన్లరిచ్‌ఫుడ్. ఇందులో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది. రాత్రి నీటిలో నానబెట్టి, ఉదయం తీసుకుంటే మరింత ప్రయోజనకరం. గుప్పెడు గుమ్మడి విత్తనాలను ప్రతిరోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు తీసుకోవడం వల్ల వేగంగా బరువు తగ్గించుకోవచ్చు. గుమ్మడి విత్తనాలు ఆకలి కోరికలను తగ్గిస్తుంది. బరువు తగ్గించే ప్రొటీన్ల ఫుడ్స్‌లో శక్తివంతమైనది గుడ్డు. గుడ్డులోని పచ్చసొన కంటే తెల్లసొన ఎక్కువగా తినడం వల్ల శరీరానికి ప్రొటీన్లు, క్యాల్షియం పుష్కలంగా అంది, ఎనర్జీని అందివ్వడంతోపాటు, బరువు తగ్గిస్తాయి. ❑


# తండ్రి-బిడ్డలు

కనుమ ఎల్లారెడ్డి

రామయ్య రిటైర్డ్ గుమాస్తా, నలుగురు ఆడపిల్లల తండ్రి. ముగ్గురికి పెళ్లి చేశాడు. వాళ్లు తమ భర్తలతో హాయిగా సంసారం చేసుకుంటున్నారు. అదృష్టవశాత్తు అల్లుళ్లు అందరూ చాలా మంచివాళ్లే దొరికారు.

చివరి అమ్మాయి రేణుక వివాహం చేసుకోకుండా ఉండిపోయింది. పెళ్లి చేసుకోమని అక్కలు, బావలు, తండ్రి ఎంత చెప్పినా రేణుక వినలేదు.

"నేను వివాహం చేసుకుని వెళ్తే నాన్నను ఎవరు చూస్తారు? అమ్మ వున్నన్నాళ్లు ఏ లోటు లేకుండా చూసుకుంది. పాపం.. నేను వెళ్తే నాన్న ఒంటరి అవుతాడు. నాకు పెళ్లి వద్దు. ఈ వయసులో నాన్న ఎక్కడికి వెళ్లాలన్నా ఎవరైనా తోడుండాలి. ఆయనకు సాహిత్యం అంటే మక్కువ. సాహిత్య సభలకు వెళ్లాలనుకుంటాడు, వెళ్లలేకపోతాడు" అని చెప్పేది.



ఒకరోజు పెద్దకూతురు మేరీ ఫోన్ చేసింది.

"ఈసారి క్రిస్మస్‌కు తాడిపత్రి వస్తున్నాం. మిగతా చెల్లెళ్లు కూడా వస్తామని చెప్పారు. నాన్న ఆరోగ్యం, నువ్వు ఎలా ఉన్నావ్?" అని అడిగింది.

దానికి రేణుక సంతోషంతో "రండి... రండి.. నాన్న కూడా ఈ మాటే చెప్పమన్నాడు. ఈలోగా నువ్వే ఫోన్ చేశావు అక్కా. అందరూ అక్కలు, బావలు వస్తే ఆ మజా వేరు" అని ఫోన్ పెట్టేసింది.

"రేణూ, ఎవరిది ఫోన్" అంటూ తండ్రి కొద్దిగా దగ్గాడు.

"ఆ సిరప్ వేసుకున్నావా నాన్నా? దగ్గుతున్నావ్ చూడు" అని మంచినీళ్లు, సిరప్ తీసుకువచ్చింది.

రామయ్య సిరప్ తాగి, మంచినీళ్లు తాగాడు. కొంచెం ఉపశమనం లభించింది. రామయ్యకు క్రీస్తు అంటే మహా ఇష్టం. అలా అని ఇతర దేవుళ్లకు తక్కువ చేయడు. "అంతా ప్రభు దయ, అని ఓసారి ఆ కోదండ రాముని ఆజ్ఞ" అనేవాడు. అందుకనే రెండో అమ్మాయికి సీత అని పేరు పెట్టాడు. మూడో అమ్మాయికి వాహిని అని పేరు పెట్టాడు. చిన్నమ్మాయి రేణుక మాత్రం బైబిల్, భగవద్గీత ప్రతిరోజూ చదువుకునేది. అలా అని ఎవరూ విమర్శించేవాళ్లు కాదు".

మనకు మత సహనం ఉండాలి. కానీ మత మౌఢ్యం ఉండరాదు" అనేవాడు రామయ్య.

వాళ్ల కుటుంబాన్ని చూసి "మీ ఇల్లు, మీరు మత సహనానికి నిలయం" అనేవాళ్లు ఇరుగు-పొరుగువాళ్లు.

రామయ్య ఆలోచనలన్నీ చిన్న కూతురు రేణు మీదనే ఉన్నాయి. పెళ్లి చేసుకోమంటే వినదు. ఆరోగ్యం అంతంత మాత్రమే. కళ్లు తిరిగి పడిపోయేది అప్పుడప్పుడు. నా కోసం పదవ తరగతిలోనే చదువు మానేసి ఇంట్లో అక్కలకు తోడుగా ఉంటోంది. ఇంటి పనంతా చక చకా చేస్తుంది. రేణు దయ వల్లనే ముగ్గురు అక్కలకు మంచి ఉద్యోగాలు వచ్చాయి. ఈసారి మా కూతుళ్లు, అల్లుళ్లు, వచ్చినప్పుడు రేణు పెళ్లి ఖాయం చేయాలి... అనుకున్నాడు రామయ్య.

అనుకున్న సమయానికి క్రిస్మస్‌కు ఒకరోజు ముందు వచ్చారు అందరూ. వాళ్లను చూడగానే రామయ్యకు చాలా సంతోషం కలిగింది. అయితే ఒక్కటే లోటు. ఎవ్వరికీ ఇంకా పిల్లలు కలుగలేదు. ఈ వయసులో మనవరాళ్ళు, మనవళ్లతో ఆడుకోవాలని అతని కోరిక. అందరూ స్నానాలు చేసి హాల్లో కూర్చున్నారు. వంటింట్లో కుస్తీ పడుతున్నారు అక్కలు. "మీరు వెళ్లి కూర్చోండి, నేను కాఫీ తీసుకువస్తా" అంది రేణుక.

"సరేలేవే" అని అక్కలు ముగ్గురు హాల్లో కూర్చున్నారు. అప్పుడే రామయ్య వాళ్లతో అంటున్నాడు "నాకు ఒక్కటే లోటు. రేణుక పెళ్లి అయితే ఇక ఏ సమస్య ఉండదు. ఈ సంవత్సరం కచ్చితంగా చేయాలి. మీకు ఎవరైనా అబ్బాయి తెలుసుకుంటే చూడండి" అన్నాడు.

దానికి పెద్దల్లుడు రాబర్ట్ "అంకుల్, నాకు తెలిసి ఓ అబ్బాయి ఉన్నాడు, నేను రేణు విషయం చెప్పాను, చూద్దాం..." అన్నాడు.

రెండో అల్లుడు ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉన్నాడు.

మూడవ అల్లుడు మాత్రం "ఎవరో ఎందుకు? మా కజిన్ ఉన్నాడు, చేద్దాం! ఏమంటారు?" అన్నాడు వాళ్ల వంక చూసి.

అప్పుడే అందరికీ కాఫీ తీసుకు వచ్చింది రేణు. "ఏదో చేద్దాం అంటున్నారు బావగారు" అంది కాఫీ టేబుల్‌పై ఉంచుతూ.

"కూర్చో రేణుకా" అన్నాడు మూడో అల్లుడు.

అక్కడ కాసేపు మౌనం.

రామయ్య రేణు వంక చూసి "అదేనమ్మా నీ పెళ్లి విషయం?" అన్నాడు.

రెండో అల్లుడు రేణుక వంక చూశాడు.

"చెప్పొద్దు బావా" అని సైగ చేసింది.

రెండో బావ చంద్ర చాలా మంచి వ్యక్తి. అతనితోనే తన బాధ చెప్పుకునేది. వారితో మాట్లాడుతుండగానే కళ్లు తిరిగి పడిపోయింది రేణుక.

అందరూ కంగారు పడ్డారు.

"రేణూ! ఏమైంది?" అని అడిగారు.

"త్వరగా హాస్పిటల్‌కు తీసుకుపోదాం" అన్నాడు రెండో బావ.

రామయ్య గారు టెన్షన్ పడుతున్నారు. ఎప్పుడూ ఇలా జరగలేదు. ఏమైందో.. ఏమో! ఓ గాడ్ అనుకుంటున్నాడు.

రేణు, చంద్రలు సైగలు చేసుకోవడం చూసింది పెద్దక్క మేరీ. ఆమె అనుమానించింది చంద్ర, రేణుల మధ్య ఏమైనా సంబంధం ఉందా అని. పరిపరి విధాలుగా ఆమె ఆలోచనలు.

అందరూ కంగారుగా హాస్పిటల్ చేరుకున్నారు. ఇంటి దగ్గర రామయ్య ఒక్కరే ఉన్నారు.

మేరీ హాస్పిటల్ నుండి హడావిడిగా ఇంటికి వచ్చి తల పట్టుకుంది.

"ఏమైందమ్మా, అలా ఉన్నావ్? రేణు ఎలా ఉంది?" అని అడిగాడు.

హాస్పిటల్ నుండి వచ్చిన తరువాత సీత, చంద్రను అడుగు నాన్నా. నాకు ఒంట్లో బాగా లేక వచ్చాను" అని బెడ్ రూమ్‌లో పడుకుంది.

హాస్పిటల్‌లో డాక్టర్ రేణుకను పరీక్షించి "మీతో ఓ విషయం చెప్పాలి" అన్నాడు.

ముఖాలు చూసుకున్నారు చంద్ర, రాబర్ట్, మేరీ, సీత, వాహిని, మూడో అల్లుడు చరణ్.

రేణు నిద్ర పోతోంది.

"ఇలా బైటికి రండి" అని పక్కకు పిలిచాడు డాక్టర్.

"ఈ అమ్మాయి మీకు ఏమవుతుంది?" అడిగాడు డాక్టర్.

"మా చెల్లెలు" అన్నారు సీత, వాహిని.

డాక్టర్ నిట్టూర్చి "అమ్మాయి పేరు" అడిగాడు.

"రేణుక" అన్నాడు చంద్ర.

"చాలా మంచి అమ్మాయి" అన్నాడు రాబర్ట్.

"ఇంతకూ ఆమె విషయం చెప్పలేదు" అన్నారు రాబర్ట్ చంద్ర.

ఇంతలో రాబర్ట్‌కు సీత, వాహిని, చరణ్‌లకు ఫోన్ వస్తే బైటకు వెళ్లారు.

డాక్టర్ కొంచెంసేపు తర్వాత "ఆమెకు కేన్సర్. ఎప్పుడు ఏమవుతుందో చెప్పలేం. బతకడం కష్టం. అదే మాట తలుపు చాటు నుండి రేణు వింది.

"వస్తాను సర్. అమ్మాయిని జాగ్రత్తగా చూసుకోండి. ఓ పది రోజుల తర్వాత రండి" అన్నాడు.

"మా మేనేజర్ అర్జెంటుగా రేపే రమ్మన్నాడు" అన్నాడు రాబర్ట్.

"మాకూ అదే ఫోన్. పండగకని వస్తే, అర్జెంటు.. రేపే రండి" అని ఆఫీసు నుంచి ఫోన్, మెసేజ్.

"ఇక ఏం చేద్దాం, వెళదాం రేణుకు చెప్పి"- "అన్నట్లు చంద్ర ఏం చేస్తున్నాడు రేణు దగ్గర" అనుకుంటూ తలుపు తీసి అక్కడి దృశ్యాన్ని చూసి నివ్వెరపోయారు.

"మాకూ అదే ఫోన్. పండగకని వస్తే, అర్జెంటు.. రేపే రండి" అని ఆఫీసు నుంచి ఫోన్, మెసేజ్.

"ఇక ఏం చేద్దాం, వెళదాం రేణుకు చెప్పి"- "అన్నట్లు చంద్ర ఏం చేస్తున్నాడు రేణు దగ్గర" అనుకుంటూ తలుపు తీసి అక్కడి దృశ్యాన్ని చూసి నివ్వెరపోయారు.

చంద్ర ఒడిలో తల పెట్టుకుంది రేణు.

ఆప్యాయంగా తల నిమురుతున్నాడు చంద్ర.

చిన్న పిల్లలా అతనిలో ఒదిగిపోయింది రేణు.

"నీకు నేను తోడుగా వున్నాను రేణూ" ఆ మాట వినగానే వాళ్లు ముగ్గురూ శబ్దం చేయకుండా వెళ్లారు.

సీత, చంద్రను అనుమానించలేదు. తన భర్త రాముడికి ప్రతిరూపం అనుకుంది. అదే మాట మేరీతో అంటే–

"నువ్వో పిచ్చిమాలోకానివి" అంది.

"హాస్పిటల్‌లో ఏం జరుగుతోందో" అనుకుంటూ ఉంది మేరీ.

"బావా" అంది రేణు.

"చెప్పమ్మా" అన్నాడు చంద్ర.

"ఈ విషయం మన మధ్యలోనే ఉండాలి. ఎవరికీ చెప్పను అని ప్రామిస్ చేయండి" అంది.

ఆ గదిలో నిశ్శబ్దం....

"రేణూ" అన్నాడు చంద్ర.

"నాకు కేన్సర్ అనే విషయం మీ కంటే ముందే నాకు తెలుసు బావా" అనగానే అదిరిపడ్డాడు చంద్ర.

"రేణూ" అన్నాడు.

"అవును బావా! ఓ సారి తల తిరిగి పడిపోయాను. అలాగే రోజూ జరుగుతుంటే డాక్టర్ దగ్గరకు వెళ్లాను. డాక్టర్ కొన్ని పరీక్షలు చేసి నాకు కేన్సర్ అని చెప్పాడు" అంది.

"అంత దుఃఖాన్ని మనసులో పెట్టుకుని నీవు నవ్వుతూ జీవిస్తున్నావంటే చాలా గ్రేట్. ఇంటికి వెళదాం పద.." అని ఇంటికి బయలుదేరారు.

...............

నిజా నిజాలు గ్రహించకుండా ఒక్క చంద్ర తప్పా అందరూ రేణును తప్పుగా అర్థం చేసుకున్నారు.

మేరీ అయితే రాద్ధాంతం చేసింది. తండ్రితో–


## సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా:

**నవ్వుల్.. రువ్వుల్,** ఎడిటర్, ఆదివారం వార్త,

నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

sunmagvaartha@gmail.com

"అది ఎందుకు పెళ్లి వద్దు అంటోందో తెలుసా నాన్నా" అంది తీవ్రంగా.

"ఏం జరిగింది?" అర్థంకాక అడిగాడు రామయ్య.

"చెప్పాలంటే మాకే సిగ్గుగా ఉంది" అన్నారు.

"మీరు ఎందుకు అంత ఆగ్రహంగా ఉన్నారో నాకు అర్థం కావడం లేదు" అన్నాడు రామయ్య.

"చంద్రకు-రేణుకు అక్రమ సంబంధం ఉంది" అని మేరీ చెప్పగానే తన కాళ్ల కింద భూమి కుంగిపోయినట్లు అయింది రామయ్యకు.

చివరి అమ్మాయి, అందరికీ తలలో నాలుకలా ఉంది, అందరి బాగోగులు చూసే రేణు, తన అక్కల కోసం తన జీవితాన్ని త్యాగం చూసిన రేణు ఇలా చేసిందా? నమ్మలేకపోయాడు రామయ్య.

ఇంతలో బైట ఆటో ఆగిన శబ్దం రావడంతో "దాని ముఖం చూస్తేనే పాపం.. పదండి బట్టలు సర్దుకుని పయనమవుదాం" అంది మేరీ.

అందరూ బట్టలు సర్దుకోవడంలో నిమగ్నమైనారు.

రామయ్య బేలగా, నిర్వేదంగా చూస్తూ ఉండిపోయాడు.

రేణు, చంద్ర ఇంట్లో అడుగు పెట్టే సమయానికి వాతావరణం ప్రశాంతంగా ఉంది. అంతా నిశ్శబ్దం.

రామయ్య సోఫాలో తల పట్టుకుని కూర్చున్నాడు.

రేణు నాన్న దగ్గరికి వెళ్లి "ఏమైంది నాన్నా? అలా ఉన్నారు?" అంది.

రామయ్య పలకలేక అట్లే ఉండిపోయాడు.

"చెప్పండి నాన్నా. నా వల్ల ఏమైనా తప్పు జరిగిందా?" అంది.

"అవును తప్పే జరిగింది" అంది మేరీ.

మిగతావారు మౌనంగా ఉన్నారు.

"నేనేమి తప్పు చేశాను?" అమాయకంగా అడిగింది రేణు.

"నువ్వు ఎందుకు పెళ్లికి సుముఖంగా లేవో మాకు అర్థం అయింది" అంది మేరీ కోపంగా.

"ఇంకా ఎందుకు దాస్తావు" అంది వాహిని.



"నీకు, చంద్రకు అక్రమ సంబంధం ఉంది" అని మేరీ అనగానే-

"ఆపండి" గట్టిగా అరిచాడు చంద్ర.

ఆ అరుపుకు అందరూ భయపడ్డారు.

కోపం కట్టలు తెంచుకుంది చంద్రకు. "మీకు బుద్ధీ, జ్ఞానం లేదు. నేను ఒక కన్నబిడ్డ కంటే ఎక్కువగా చూసుకునే రేణు గురించి మీరు అలా మాట్లాడటం, నింద మోపటం సరి కాదు.

తనకు కేన్సర్ అనే విషయం నాకు, రేణుకు తప్పా ఎవరికీ తెలియదు. నాతోనే చెప్పింది. నేను రహస్యంగా వుంచాను. మా ఇద్దరి మధ్య తండ్రీ, బిడ్డ సంబంధం తప్పా మీరు అనుకున్నట్లు ఏమీ కాదు. మీ కోసం తను జీవితాన్ని త్యాగం చేసింది. తండ్రిని ఓ బిడ్డలాగా చూసుకుంటోంది. ఆయనకు అన్ని సపర్యలు చేస్తోంది. నేను వివాహం చేసుకుని వెళ్లిపోతే నాన్న బాగోగులు ఎవరు చూస్తారు? అని లోలోపల ఎంతో బాధ అనుభవించింది. తను బతికి వున్నన్ని రోజులైనా తండ్రికి, మనకు అందరికీ సంతోషం కలిగించాలనే ఈ క్రిస్మస్‌కు అందరినీ చివరిసారిగా చూడాలన్నదే ఆమె కోరిక. తను ఎక్కువ కాలం జీవించదని నాకు, తనకే మాత్రమే తెలుసు" అని చంద్ర చెబుతుండగా-

'రేణూ! నా బంగారు తల్లీ" అని కళ్లల్లో నీళ్లు పెట్టుకున్నాడు రామయ్య.

విషయం తెలిసి అందరూ తలలు వంచుకున్నారు

నిర్వేదంగా చూస్తోంది రేణు.

మేరీ వెళ్లి రేణు చేతులు పట్టుకుని "నన్ను క్షమించవు" అంది.

కళ్లల్లో నీళ్లు తిరుగుతుంటే కన్నీళ్లు తుడుస్తూ "మనలో మనకు క్షమాపణ ఎందుకు అక్కా?" అంది.

మేరీ రేణును గట్టిగా వాటేసుకుంది.

"మమ్మల్ని కూడా క్షమించు" అన్నారు రాబర్ట్, సీత, వాహిని, చరణ్.

"మనమందరం సంతోషంగా ఉంటే అంతే చాలు" అంది రేణుక.

"ఇంకెక్కడి సంతోషం తల్లీ" అని బావురుమన్నాడు రామయ్య.

రేణు రామయ్య దగ్గరికి వెళ్లి "నాన్నా, నీ ఆరోగ్యం జాగ్రత్త. మీరు నా గురించి బాధపడవద్దు" అంది.

"నా చిట్టితల్లీ" అన్నాడు జీరబోయిన గొంతుతో.

అందరిలో కన్నీళ్లు ఉబికి వస్తున్నాయి.

రామయ్య సోఫాలో నుంచి లేచి రేణును దగ్గరకు పిలుచుకుని నుదిటిపై ముద్దు పెట్టుకోగానే ఇద్దరూ హఠాత్తుగా కూలిపోయారు.

తండ్రి గుండెల మీద పడింది రేణు, రామయ్య చేయి రేణు తలపై ఉంది.

ఇద్దరిలో ఊపిరి ఆగిపోయింది.

"నాన్నా, రేణూ లేవండి" అంది మేరీ.

అప్పటికే ఇద్దరూ ప్రాణాలు విడిచారు.

"అమ్మా రేణూ" విలపించాడు చంద్ర.

మిగతావారు దుఃఖ సముద్రంలో మునిగిపోయారు.

వారి అందరి కన్నీళ్లు ఆ రెండు శవాలపై పడుతున్నాయి. ఒకేరోజు తండ్రి, బిడ్డ మరణం వారిని కదిలించింది.

## ఐదు ఓట్లు

రవి: ఏమైందిరా? ఏడుస్తూ నవ్వుతున్నావు!?!?

నాని: నా పెళ్లాం అనిల్‌తో లేచిపోయిందిరా. అందుకు నవ్వుతున్నాను. అనిల్ గురించి తలుచుకుంటే ఏడుపు వస్తోంది.




## సీరియల్ పిచ్చి

తల్లి: ఏరా! ఏమైంది? అన్నం తినడం లేదు.

రవి: కూర వేస్తానని చెప్పింది. కానీ సీరియల్ స్టార్ట్ అయిందని వెళ్లిపోయింది.

తల్లి: ఆ... సీరియల్ మొదలైందా? ఇప్పుడే వస్తానురా! అంటూ తల్లి కూడా వెళ్లిపోయింది.

## నేను లేకపోతే?

గూగుల్: నా దగ్గర అన్నీ వున్నాయి.

వికీపీడియా: నాకు అన్నీ తెలుసు.

ఇంటర్నెట్: నేను లేకపోతే మీరు జీరో ఎలక్ట్రిసిటీ. నాతో ఆటలాడకండి.

- ఈ.ఎస్.మాధవన్

డా॥ బీరం సుందరరావు

# చెరగని కవిత్వ సంతకం శేషేంద్ర

"కాలం నిన్ను ప్రశ్నిస్తోంది. నీవు ప్రజల పక్షాన నిలబడదలిస్తే కలంతో కదిలివచ్చి, వాళ్ల గుండెల మీద ముద్ర పడేలా రాయి. వాళ్ల జీవితాన్ని వాళ్ల భాషలోనే చెప్పు" అంటారు మహాకవి శేషేంద్ర.

డా॥ గుంటూరు శేషేంద్ర శర్మ అసలు సిసలైన ప్రజాకవి. యుగధర్మాన్ని ప్రతిబింబిస్తూ మహత్తర కావ్యాలు రాసిన యుగకవి. వాదాలు, వివాదాలు చుట్టుముట్టినా, అరసాలు, విరసాలు వీరంగం వేసినా, సమకాలీన కవులు గుర్తించకపోయినా, విమర్శకులు సరిగా అర్థం చేసుకోలేకపోయినా, అన్నింటికీ అతీతంగా, కవిత్వమే ప్రాణశ్వాసగా, సరికొత్త కవిత్వపు మేనిఫెస్టోను లోకానికి బహూకరించిన కవిసేనా నాయకుడు శేషేంద్ర. కవిత్వానికి విప్లవ భాషను నేర్పిన భాష విప్లవ భాషా విధాత శేషేంద్ర. శబ్దాల్ని మైనపు ముద్దల్లా చేసి, అర్థాలకు ఆర్ద్రతను అద్ది, హృదయాలను కవిత్వంతో రసాప్లావితం చేసిన కవితా రసావతారుడు శేషేంద్ర. శేషేంద్రను ఎన్ని కోణాల నుంచి చూసినా విలక్షణంగా కన్పిస్తారు, విశిష్టంగా దర్శనమిస్తారు.

"ఆధునిక మహాభారతం"లో ప్రతి కవిత ప్రతి అభివ్యక్తి. శేషేంద్ర శర్మ సామాజిక దృష్టికి, సాహిత్య స్పృహకు ప్రతీకగా నిలుస్తుంది. నవ్య కవితా సృష్టికి పతాకగా దర్శనమిస్తుంది.

"రైతులారా! రాజకీయ వర్షం పడుతుంది.. మోసపోయి విత్తనాలు చల్లకండి" అంటూ రైతుగొంతుతో కవిత్వం రాసిన శేషేంద్రను అచ్చమైన రైతుకవి అనడం అతిశయోక్తి కాదు. శేషేంద్ర మాటల్లో చెప్పాలంటే–

"ఎవరు దేశమంతా దున్ని, తమ దేహపు కండలు మట్టికిచ్చారో, ఎవరు నేలగొంతు ఆలించి తమ చెమటతో, రక్తంతో దాన్ని మృదువు చేశారో, ఎవరు ధాన్యంగింజ కోసం, ఉదయాస్తమయాలు కలలు కన్నారో, చివరకు ఒక్క గింజ కూడా దక్కకుండా విషాదంతో నిష్క్రమిస్తారో వాళ్లే అన్నదాతలు.. ఈ మానవేతిహాసంలో అమృతవీరులు. "ఆధునిక మహాభారతంలో కర్మవీరులు. నా వ్య కథానాయకులు" అని సగర్వంగా ప్రకటించిన కవి శేషేంద్ర. "రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. రైతుల కోసమే మేం పుట్టాం–' అని శుష్క హామీలతో పరిపాలన చేస్తున్న మన నాయకులంతా శేషేంద్ర ఆవేదనను గుర్తిస్తే, ఆచరణలో రైతును ఆదుకుంటే దేశం బాగుపడుతుంది.

"పద్యరచనలో పండిన పంట చేను శేషేంద్ర కవిత్వం" అన్నారు వేలూరి శివరామకృష్ణ. "శేషేంద్రలా పద్యం రాయడం.. శేషేంద్రకే సాధ్యం" అన్నారు డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు.

ప్రక్రియ ఏదైనా, ప్రయోగమేదైనా, మనిషితత్వం+మానవత్వం=శేషేంద్ర కవిత్వం. ఇజాలకతీతమైన అసలైన హ్యూమనిజం శేషేంద్ర కవితాత్మ– శేషేంద్ర కవిత్వాన్ని మూల్యాంకనం చేయడంలో మన విమర్శకులు పాక్షిక దృష్టితో వ్యవహరించారు. శేషేంద్ర కవిత్వంలోని సమకాలీనతను మాత్రమే చూచి, సార్వకాలీనతను అంచనా వేయడంలో దారి తప్పారు. వర్తమానంలో బతుకుతూ గతం గొప్పదనే కవులకు, వాళ్లను ఆశ్రయించుకుని, స్తోత్ర పాఠాలతో బతికే విమర్శకులకు శేషేంద్ర సృష్టించిన సరికొత్త శాబ్దిక, భావగర్భిత, ధ్వన్యాత్మక పదచిత్ర ప్రపంచం అర్థం కాదు. శేషేంద్ర కవిత్వంలోని శైలి, శిల్పం, సౌందర్యం తెలియాలంటే మెదడుతో కాదు, హృదయంతో చదవాలి, రసదృష్టితో చదవాలి. మన విమర్శకులకు రంధ్రాన్వేషణ తప్ప రసాన్వేషణ తక్కువ. ఒక సోమసుందర్, ఒక జి.వి.సుబ్రహ్మణ్యం, ఓ రామమూర్తి శేషేంద్ర కవిత్వపు లోతుల్ని చూడగలిగారు. "నేను నా జీవితంలో రాసింది ఒకే ఒక కావ్యం. దాని పేరు "నా దేశం, నా ప్రజలు". దాని వర్తమాన నామాంతరం "ఆధునిక మహాభారతం".

కలంతో కాలపత్రం మీద చెరగని కవిత్వ సంతకం చేసిన మన తరం మహాకవి శేషేంద్ర శర్మ. శేషేంద్ర కవిత్వమే జీవితమైన నిలువెత్తు నిబద్ధకవి. సామాజిక స్పృహ కంటే, సాహిత్య స్పృహ ముఖ్యమన్న కవి తెలుగు వచన కవిత్వంలో అన్ని ప్రయోగాలకు, ప్రతీకలకు, పోకళ్లకు అక్షరసాక్షిగా నిలిచిన కవి. కుందుర్తి వచన కవితా ఉద్యమానికి పరిపూర్ణత నిచ్చిన కవి. వచన కవిత్వంలో కవిత్వం కనుమరుగై వచనం వరదవెత్తుతున్న తరుణంలో వచన కవితకు నిజమైన కవిత్వపు గౌరవాన్ని కలిగించారు శేషేంద్ర.

కవిత్వం చదివాక మనిషి ఆలోచనలు విస్తరించాలి. ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి ఎదగాలి. కోటి గొంతుల పాటగా మారాలి. సరికొత్త బాటలో నడవాలి. కవి నుండి ప్రజలు ఏం కోరుకుంటున్నారో, ఎలాంటి సమాజాన్ని కాంక్షిస్తున్నారో దాన్నే కవిత్వంగా రాయాలి. అప్పుడే కవి వీరుడవుతాడు. జాతిని నడిపే నేతలాగే, అజ్ఞాత ప్రజానేతగా జేజేలందుకుంటాడు.

శేషేంద్ర "కవిసేన మేనిఫెస్టో' కొత్త తరం కవులకు సిలబస్ లాంటిది. కొత్త సాహిత్య సిద్ధాంతాలను శేషేంద్ర ప్రతిపాదించారు. ఇందులో కొత్తగా



చెప్పిందేముంది? అంటూ కొందరు పెదవి విరిచారు. మరికొందరు శేషేంద్ర విప్లవ భాషకు విద్దూర వ్యాఖ్యానాలు చేశారు. విమర్శను విమర్శగా చూడలేని గుడ్డి లోకానికి నా నవ్యదృష్టి అర్థంకాదు. నన్ను అర్థం చేసుకునేవాళ్లు, నా వెంట నడిచే వస్తారు. సరికొత్తగా రాస్తారు. వాళ్ల కోసమే నా కవిసేన" అన్నారు ఓ ఇంటర్వ్యూలో శేషేంద్ర. శేషేంద్ర నిరంతర కవి, నిత్య పరిణామశీలి. కవిత్వాన్ని ఎంత గొప్పగా రాశారో, అంత గంభీరంగా, గాన యోగ్యంగా కవిత్వం చదివి సభా ప్రాంగణాలను వెలిగించారు. "కవిత్వం కోసం పుట్టిన కారణజన్ముడ" ని రైతుకవి గొట్టిపాటి నరసింహస్వామి, నాలాంటి అభిమానులంటారు. తెలుగు కవిత్వంపై శేషేంద్ర సంతకం చెరగనిది, చెదరనిది.

# నాదస్వరానికి చిరునామా

యామిజాల జగదీశ్

**“నేను పలు చోట్ల కొన్ని నాదస్వరాలను వాయించాను. కానీ ఏ నాదస్వరమూ శుద్ధ మధ్యమం” రాగానికి సరిపోయేది కాదు. అయితే నరసింగపేట్టయ్‌లో ఆ నాదస్వరం తయారుచేసే వారున్నారు. తమిళనాడులోని తిరువావుడుదురై నుంచి అర కిలోమీటరు దూరంలో నరసింగపేట్టయ్ ఉంది. చెన్నై నుంచి 275 కిలోమీటర్ల దూరంలో ఉందీ నరసింగపేట్టయ్.**

ఈ ఊళ్లో నాదస్వరాల తయారీలో ఎన్.జి.ఎన్.రంగనాథ ఆచారికో ప్రత్యేక స్థానముంది. ఆయన ఆరు రంధ్రాల నాదస్వరాన్ని ఇచ్చారు. ఈ నాద స్వరంతో నేననుకున్న రాగాన్ని అద్భుతంగా వాయించగలిగాను. ఈ నాదస్వర తయారీదారు రంగనాథుడి ప్రావీణ్యాన్ని గుర్తించమని తమిళనాడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను” అని మెచ్చుకున్న నాదస్వరం విద్వాంసుడి పేరు టి.ఎన్.రాజరత్నం పిళ్లయ్. రాజరత్నం పిళ్లయ్ సూచన మేరకు తయారు చేసిన ఆ నాదస్వరం పేరు పారి నాదస్వరం!

రాజరత్నం పిళ్లయ్ స్వయంగా రాసిచ్చిన ప్రశంసా లేఖను రంగనాథన్ ఆచారి ఫ్రేమ్ కట్టి ఇంట్లో భద్రంగా దాచారు. ఈ లేఖ ఎంతో విలువైనదని రంగనాథ ఆచారి కుటుంబం చెప్పుకుంటుంది.

రంగనాథ ఆచారి మరణం తర్వాత ఆయన కొడుకు, మనవళ్లు ఈ నాదస్వరాల తయారీ వృత్తిని కొనసాగిస్తున్నారు.

నరసింగపేట్టయ్‌లో ప్రస్తుతం నాలుగు కుటుంబాలవారు నాదస్వరాలను తయారు చేస్తున్నారు. వీరి పెరట్లో నాదస్వర తయారీకి కావలసిన ముడి పదార్థాలు, దుంగలు వంటి క్రమపద్ధతిలో పేర్చబడి ఉంటాయి.

ప్రతిరోజూ ఉదయం పది గంటలకల్లా ఈ కుటుంబాలవారు నాదస్వరాల తయారీ మొదలు పెడతారు. ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరిద్దరు సహాయకులుంటారు.



సెల్వరాజ్ అనే అతను మాట్లాడుతూ నాదస్వరం లేనిదే తమిళ వివాహాలు జరగవు. అలాగే ఆలయాలలో ఉత్సవాలకు నాదస్వర వాయిద్యం తప్పనిసరిగా ఉంటుందన్నారు. మంగళకరమైన వాయిద్యాలలో నాదస్వరమొకటి.

సెల్వరాజ్ తండ్రి రంగనాథ ఆచారి 1955లో నాదస్వర తయారీలో ఓ కొత్తదనం తీసుకొచ్చారు.

శాస్త్రీయ నామం అయిన అర్దువిక ఫిన్నెట్టా చెట్ల దుంగలతో ఈ నాదస్వరాలు తయారవుతాయి. వీటికి ఆకుపచ్చ కలపను ఉపయోగిస్తారు. ఈ చెట్టు వయస్సు కనీసం 75-100 సంవత్సరాలు ఉండాలి. ఒక్కో నాదస్వరం తయారు చేయడంలో ముగ్గురు వ్యక్తులు తమ పనితనాన్ని ప్రదర్శిస్తారు. ఈ నాదస్వరం ఖరీదు అయిదు వేలు.

సెల్వరాజ్ మామ శక్తివేల్ ఆచారి కూడా నాదస్వరాలు తయారు చేస్తారు.

సెల్వరాజ్ పెద్ద కుమారుడు సతీష్ వాహనాలు నడపడం, వ్యవసాయం చేస్తుంటారు. సతీష్ అత్తమామలు, అక్కాచెల్లెళ్లు, తల్లి శాంతి కూడా నాదస్వరం తయారు చేయడంలో నిమగ్నమవడంతో సతీష్ వ్యవసాయం చూసుకుంటున్నారు.

శక్తివేల్ కుమారుడు సెందిల్‌కుమార్ కూడా పదిహేనేళ్ల నుంచి నాదస్వరాలను తయారు చేస్తున్నారు. వీటి తయారీలో యంత్రాలను ఉపయోగించడం మొదలు పెట్టాడు సెందిల్‌కుమార్. వీరి వర్క్‌షాప్‌లో జనరేటర్, హార్స్‌పవర్ మోటార్‌పై నడుస్తున్న లేథ్ మిషన్ ఉన్నాయి. ఒకానొకప్పుడు నాదస్వరాన్ని చేత్తోనే తయారు చేసేవారు. అయితే నాలుగో తరంవారు మిషన్లను వినియోగించడం మొదలు పెట్టారు.

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

సింగిల్ పేజీ కథ

# సిండరిల్లా

ఇంగ్లీషు: గిల్‌డేవిస్
అనువాదం: భూషి కృష్ణదాసు

పూర్వం ఎల్లా అని ఒకమ్మాయి ఉండేది. ఆమె చాలా అందగత్తె. తల్లిదండ్రులతో ఆమె ప్రశాంతంగా కాలం గడుపుతూ వుండేది. ఇలా వుండగా తల్లి జబ్బు చేసి చనిపోయింది. తండ్రి రెండో పెళ్లి చేసుకున్నాడు. మారుటి తల్లికి ఇద్దరు కుమార్తెలు వున్నారు. వాళ్లను తీసుకుని మారుటితల్లి కాపురానికి వచ్చింది. మారుటితల్లిలో జాలి, కరుణ లేవు. ఎల్లాను సతాయించి అన్ని పనులు చేయించుకునేది. క్షణం విశ్రాంతి లేకుండా కష్టపడుతున్నా ఎంత మాత్రం విసుగు చెందేది కాదు. ఆ ఊళ్లో అందరూ ఎల్లాను సిండరిల్లా అని పిలిచేవారు.

ఒకరోజు రాజదర్బారు నుండి ఆహ్వానం వచ్చింది... యువరాజుతో బాల్ డ్యాన్సు జరుగుతుందనీ, ఉత్సాహమున్న యువతులు ఎవరైనా వచ్చి పాల్గొనవచ్చని ప్రకటించారు. ఆ ప్రకటన తెలిసి సిండరిల్లా మనసు సంతోషంతో ఉరకలు వేసింది. కానీ అలాంటి అదృష్టం తనకు కలగనందుకు ఆమె మనస్సు చివుక్కుమంది.

మారుటితల్లి సిండరిల్లాతో "యువరాజుతో డ్యాన్సు నీలాంటి వాళ్లకోసం కాదు. నీ అంతస్తు ఏమిటో ఆలోచించావా?" అని హేళన చేసింది.

సిండరిల్లా నిరుత్సాహపడి ముడుచుకుపోయింది. ఇంతలో ఒక విచిత్రం జరిగింది. ఒక మెరుపు మెరిసింది. ఆ మెరుపులోంచి ఒక దేవతాస్త్రీ లాంటి ముసలి అవ్వ ప్రత్యక్షమైంది. ఆమెను చూసి సిండరిల్లా భయపడింది.

"సిండరిల్లా, నీవు భయపడకు. నీకు సహాయం చేయడానికే వచ్చాను. నన్ను నమ్ము. నీ మారుటి తల్లి, ఆమె కూతుళ్లు మంచివాళ్లు కాదు. నిన్ను నిర్దయగా వదిలి యువరాజు బాల్ డ్యాన్సుకు వెళ్లారు. అయినా చింతపడకు. నిన్ను డ్యాన్సు ప్రోగ్రాంకు తీసుకువెళ్లే బాధ్యత నాది. అయితే నువ్వు నాకు ఒక సహాయం చేయాలి. నేనిప్పుడు చెప్పే మూడు వస్తువులు.. ఒక గుమ్మడికాయ, రెండు ఎలుకలు చివరగా ఒక బల్లి తెచ్చిపెట్టాలి. అప్పుడు మన పథకం జయప్రదం అవుతుంది.

అవ్వ చెప్పిన మూడు వస్తువులు సిండరిల్లా పట్టుకొచ్చింది. అవ్వకు చాలా తృప్తి కలిగింది.

అవ్వ తన చేతిలో వున్న మంత్రదండాన్ని గమ్మత్తుగా గాలిలోకి తిప్పింది. చూస్తూ వుండగానే గుమ్మడికాయ కోచ్‌బండిలా మారిపోయింది. ఎలుకలు రెండూ తెల్లని గుర్రాలయినాయి. బల్లి బండి నడిపే కోచ్‌మెన్‌గా మారిపోయింది.

ఏర్పాట్లన్నీ పరిశీలించగా అవ్వకు ఒక లోటు కనిపించింది. సిండరిల్లా వేసుకున్న డ్రెస్సు ఏమాత్రం నచ్చలేదు. యువరాజుతో బాల్ డ్యాన్సుకు తగినట్టుగా సిండరిల్లా డ్రెస్సు నాజూగ్గా లేదు. అవ్వ చేతిలో వున్న మంత్రదండాన్ని గాలిలోకి తిప్పింది. వెంటనే వజ్రాలు, లేసులు పొదిగిన డ్యాన్సు డ్రెస్ సిండరిల్లా శరీరానికి అమరిపోయింది. బయట కోచ్‌బండి సిద్ధంగా వుంది. అవ్వ సిండరిల్లాను పిలిచి చెప్పింది. అర్ధరాత్రి దాటకుండానే ఇంటికి తిరిగి వచ్చేయాలని, లేకపోతే మళ్లీ చాకిరీ తప్పదు అని. సరేనని అని సిండరిల్లా ఆ వెన్నెల రాత్రిలో డ్యాన్సు డ్రెస్సులో దేవకన్యలా రాజదర్బారుకు చేరుకుంది కోచ్‌బండిలో.

ఆమె రాకతో హాలంతా సంపూర్ణ నిశ్శబ్దం సంతరించుకుంది. బాల్ డ్యాన్సు ఆరంభమైంది. ప్రేక్షకులు యువరాజు సిండరిల్లాతో డ్యాన్సు చూస్తూ మైమరిపోయారు. ఇంతలో విశ్రాంతి గంట మోగింది. ఆ శబ్దం విని సిండరిల్లా ఉలిక్కిపడింది. అవ్వ తనకు చెప్పిన హెచ్చరిక గుర్తుకు వచ్చింది. సిండరిల్లా భయపడి గబగబా మెట్లు మీంచి కిందికి వచ్చేసింది. జారిపోయిన చెప్పును సిండరిల్లా గమనించలేదు. సిండరిల్లా కన్పించకపోవడంతో యువరాజు కంగారు పడ్డాడు. అన్ని పక్కలా వెదికాడు. అందర్నీ అడిగాడు. డ్యాన్సు ప్రోగ్రాంతో యువరాజు సిండరిల్లా చాలా దగ్గరైపోయి పరస్పరం ప్రేమించుకున్నారు. డ్యాన్సు ప్రోగ్రాం తరువాత సిండరిల్లా నేరుగా ఇంటికి వచ్చేసింది. సిండరిల్లాకు రాత్రంతా యువరాజు కలలే వచ్చాయి. మరుసటి రోజు అసలు హడావుడి ప్రారంభమైంది. యువరాజు తమతో డ్యాన్సు చేయలేదని మారుటి తల్లి కూతుళ్లు చాలా కోపంగా వున్నారు. అలాగే చాలామంది యువతులు యువరాజు డ్యాన్సు చేసే అవకాశం దొరక్క ఆయన్ను ద్వేషించారు.

యువరాజు మెట్లు దిగి కిందకు వస్తుండగా మెట్ల మీద పడి వున్న ఆడవాళ్ల చెప్పు ఆయన కంట పడింది. ఇంత అపురూపమైన చెప్పు ఎవరిదో! నేను ఆమెను పెళ్లి చేసుకుంటానని యువరాజు ప్రకటించి– ఆ చెప్పును ఒక ఎత్తయిన వెల్వెట్ స్టూలుపై ప్రతిష్ఠించి ఇంటింటా ప్రదర్శించారు. ఆ విషయం తెలిసి వయసులో వున్న అనేక మంది యువతులు యువరాజును భర్తగా పొందవచ్చనే భ్రాంతితో నేనంటే నేను... అని పోటీ పడి చెప్పులో కాలు పెట్టడానికి ప్రయత్నించి విఫలమయ్యారు.

ఆ చెప్పు ఎవరికీ సరిపోలేదు. సిండరిల్లా కోసం ఆరా తీసిన



యువరాజు ఎట్టకేలకు సిండరిల్లా ఇంటికి వచ్చాడు. కిచెన్‌లో వున్న సిండరిల్లా బయటకు వచ్చింది. యువరాజు వెంటనే ఆమెను గుర్తు పట్టాడు. నేను కూడా చెప్పులో కాలు పెట్టి ప్రయత్నించనా? అని వినయంగా యువరాజును కోరింది. యువరాజు అంగీకరించాక సిండరిల్లా చిన్నగా నవ్వి కాలికి చెప్పు తొడుక్కుంది. సిండరిల్లాకు కాలుకి చెప్పు సరిగ్గా సరిపోయింది. చుట్టూ కరతాళ ధ్వనులు వినిపించాయి. నేను పోగొట్టుకున్న చెప్పు ఇదే అని సిండరిల్లా నవ్వింది. పోగొట్టుకున్న ప్రియురాల్ని తిరిగి పొందిన అదృష్టవంతుణ్ణి అని యువరాజు సంతోషాన్ని వెలిబుచ్చాడు. కనుక సిండరిల్లా నా భార్య అని ఆమె చేతిని ముద్దు పెట్టుకున్నాడు. అదే సమయంలో అవ్వ మంత్రదండాన్ని గాలిలోకి తిప్పింది. తృటిలో సిండరిల్లా పెండ్లికుమార్తె డ్రెస్సులో వెలిగిపోయింది. అందరి సమక్షంలో యువరాజు సిండరిల్లాను వివాహం చేసుకున్నాడు. వాళ్లిద్దరూ రాజు, రాణి అయ్యారు. ప్రజల్ని చల్లగా సౌఖ్యంగా పాలించారు. ✦



షేక్ అబ్దుల్ హాకీం జాని

# నీటి వంతెనలు చూడతరమా!

సాంకేతికంగా ప్రపంచంలోని అన్ని దేశాలు పరుగులు తీస్తున్నాయి. వారి అవసరాల కోసం నూతన నిర్మాణాలను రూపొందించుకుంటున్నారు. అటువంటి వాటిలో కొన్ని నీటి వంతెనలు కూడా ఉన్నాయి. సాధారణంగా వంతెనలపై వాహనాలలో ప్రయాణించవచ్చు. అయితే నీటి వంతెనలపై వాణిజ్య నౌకలు, పడవలు ప్రయాణిస్తుంటే, వీటి అడుగు భాగాన నిర్మించిన రహదారి సొరంగ మార్గం ద్వారా వాహనాలు పరుగులు తీస్తుంటాయి. కొన్ని నీటి వంతెనల కింద నదులు ప్రవహించడం విశేషం. ఈ నీటి వంతెనలు వేటికవే ప్రత్యేకతను చాటుకుంటూ జనబాహుళ్యానికి ఉపయోగపడుతూ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

## వెలెవేమీర్ ఆక్విడెక్ట్

ఇది ప్రపంచంలోనే చక్కటి సొరంగ రహదారి పై భాగంలో నిర్మించిన నీటి వంతెన. దీన్ని వెలెవేమీర్ ఆక్విడెక్ట్, డ్రోంటర్‌మీరాక్విడక్, నీటి వంతెన ఇత్యాది పేర్లతో కూడా పిలుస్తారు. 25 మీటర్ల పొడవు, 19 మీటర్ల వెడల్పుతో ఈ నీటి వంతెనను నిర్మించారు. నెదర్లాండ్స్‌లోని డచ్ నగరానికి చెందిన హార్డర్‌విజ్క్‌లో వెలెవేమీర్ సరస్సు ఉంది. దీని అడుగు భాగాన సొరంగ మార్గంలో నిర్మించిన జాతీయ రహదారిని ఎన్ 302 అని పిలుస్తారు. ఈ రహదారికి, నీటి వంతెనకు మధ్య ఎత్తు తక్కువగా ఉంటుంది. అందువల్ల ఎత్తైన భారీ వాహనాలు ఈ సొరంగ మార్గం గుండా ప్రయాణించలేవు. నీటి అడుగు భాగాన నిర్మించిన అద్భుతమైన ఇంజినీరింగ్ ప్రతిభాపాటవాలకు తార్కాణంగా నిలిచే జాతీయ రహదారిపై ప్రతీరోజు 28 వేల నుండి 34 వేల వరకు పలు రకాల వాహనాలు ఈ సొరంగ మార్గం ద్వారా ప్రయాణిస్తున్నాయి. వంతెన పైభాగంలో ప్రవహిస్తున్న నీటి పక్కనే చిన్న రహదారి నిర్మించారు. కాలి నడకన, సైకిళ్లపై వెళుతూ ప్రకృతి అందాలను వీక్షించవచ్చు. నీటి వంతెన నిర్మాణానికి 61 మిలియన్ల అమెరికన్ డాలర్లు ఖర్చు చేశారు. నెదర్లాండ్స్ శివార్లలో ఉన్న ఈ రహదారి ప్లెవోలాండ్ అనే పొరుగు ద్వీపంతో ప్రధాన భూభాగాన్ని కలుపుతుంది.

1998లో దీని నిర్మాణాన్ని ప్రారంభించి 2002లో పూర్తి చేశారు. ఈ వంతెనపై వెలెవేమీర్ సరస్సు జలాలు ప్రవహిస్తుంటాయి. ఈ నీటిపై తేలికపాటి నుండి భారీ నౌకలు కూడా ప్రయాణిస్తాయి. దీని నిర్మాణానికి 22 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్, ఇనుము ఉపయోగించారు. సొరంగంపై నిర్మించిన వంతెన పొడవు 25 మీటర్లు, వెడల్పు 19 మీటర్లు, నీటి లోతు మూడు మీటర్లు ఉంటుంది. ఈ వంతెన పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది.

## మాగ్డేబర్గ్ నీటి వంతెన

ఇది జర్మనీలోని మాగ్డేబర్గ్ సమీపంలో నిర్మించిన అతి పెద్ద నౌకాయాన జల మార్గం. నీరు ప్రవహించే ఈ వంతెనను ఆక్విడక్ట్ అని పిలుస్తారు. యూరప్‌లోనే అతి పెద్ద కెనాల్ అండర్ బ్రిడ్జ్. ఇది ఎల్బే నదిపై వ్యాపించి పశ్చిమాన ఉన్న మిట్టెల్‌ల్యాండ్ కెనాల్‌ను, తూర్పు వైపున ఉన్న ఎల్బే-హావెల్ కెనాల్‌ను నేరుగా కలుపుతుంది. ఈ నిర్మాణం పనులు 1905 ప్రారంభమై 1942 వరకు సుదీర్ఘ కాలం కొనసాగాయి. 1919లో రెండు జల మార్గాలను కలపాలని భావించారు. రెండో ప్రపంచ యుద్ధం కారణంగా నిర్మాణం పనులు కొంత కాలం ఆగిపోయాయి. తూర్పు, పశ్చిమ జర్మనీల మధ్య నెలకొన్న వివాదాల వల్ల కూడా నిర్మాణం పనులు నిలిచిపోయాయి. 1938 నాటికి రోథెన్సీ బోట్ లిఫ్ట్, యాంకర్లు ఏర్పాటు చేశారు. 1997లో నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించి 2003లో దీన్ని పూర్తి చేశారు. దీన్ని పూర్తి స్థాయిలో నిర్మించడానికి 80 సంవత్సరాలు పట్టింది. నేడు ఈ వంతెన బెర్లిన్‌లోని ఇన్‌ల్యాండ్ హార్బర్ నుండి రైన్ నది వెంట ఉన్న ఓడరేవును కలుపుతుంది. దీని నిర్మాణానికి 24 వేల టన్నుల ఉక్కును, 68 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్‌ను వాడారు. నీటి ప్రవాహం పొడవు 918 మీటర్లు.

ఇందులో 690 మీటర్లు భూమిపై, 228 మీటర్ల మేర నీరు వంతెనపై ప్రవహించడం విశేషం. దీని వెడల్పు 34 మీటర్లు. నదిపై నిర్మించిన వంతెన ఎత్తు 6.25 మీటర్లు. నీటి లోతు 4.25 మీటర్లు. వంతెనకు ఇరువైపులా నిర్మించిన చిన్నపాటి దారిపై పర్యాటకులు నడుస్తూ/సైకిళ్లపై వెళ్లవచ్చు. రవాణా సౌకర్యం కోసం ఈ నీటి వంతెనను నిర్మించారు. దీని వల్ల పలు ప్రాంతాల మధ్య దూరం కూడా తగ్గుతుంది.

## ఫాల్కిర్క్ చక్రం

దీన్ని పడవ లిఫ్ట్ అంటారు. ఇది స్కాట్లాండ్‌లో నిర్మింపబడిన ఒక అత్యద్భుతమైన వంతెన. ఈ వంతెన ప్రత్యేకత ఏమిటంటే ఇది పడవలను పైకి లేపగలదు. 2014లో ఈ అద్భుతాన్ని సందర్శించిన పర్యాటకుల సంఖ్య 55 లక్షలు దాటడంతో అప్పట్లో వార్తల్లోకి ఎక్కింది. నేలపై ఉన్న నీటి ప్రవాహంపై ప్రయాణించే పడవలను లిఫ్ట్ ద్వారా వంతెన పైభాగంలో ఉన్న నీటిలోకి చేర్చే తొలి లిఫ్ట్ ఇది.

ప్రపంచంలో చక్రంలా తిరిగే తొలి బోట్ లిఫ్ట్. స్కాట్లాండ్‌లోని ఆకర్షణీయమైన ప్రదేశం ఫాల్కిర్క్. దీనికి చక్రం ఉండటం వల్ల ఫాల్కిర్క్ చక్రం అని పిలుస్తారు. దీన్ని 2002 మే 24న ఎలిజబెత్ రాణి-2 ప్రారంభించారు. ఫాల్కిర్క్ వీల్ స్కాట్లాండ్‌లోని రెండు



నదులను కలుపుతుంది. ఫాల్కిర్క్‌ను ఎడమ వైపున ఫోర్త్, క్లైడ్ నదులు, కుడివైపున యునియన్ నది ఉంది. దాదాపు వంద ఏనుగులు ఎంత బరువు ఉంటాయో.. అంత బరువైన నౌకలను లిఫ్ట్ ద్వారా పై భాగానికి చేర్చగలదు. అయిదు నిమిషాలలో 180 డిగ్రీలు తిరుగుతుంది. ఈ చక్రం మొత్తం 360 డిగ్రీలు తిరగడం విశేషం. వంతెనపై భారీ బోట్లు కూడా తిరగడానికి వీలయ్యేలా కాలువను నిర్మించారు. వంతెనకు ఒకవైపు భారీ చక్రాన్ని అమర్చారు. దీన్నే బోట్ లిఫ్ట్ అంటారు. ప్రపంచంలో చక్రంలా తిరిగే ఏకైక బోట్ లిఫ్ట్‌గా ఇది ఖ్యాతినార్జించింది. ఈ చక్రం క్షణాల్లో కింది కాలువలో ఉన్న పడవలను పైకి ఎత్తగలదు. పైనున్న వాటిని కిందికి దింపగలదు. పడవలు కాలువలో ప్రయాణం చేసి ఈ చక్రంలోకి వచ్చి ఆగుతాయి. అప్పుడు ఈ చక్రం పడవలను 115 అడుగుల ఎత్తుకు లేపి, పైన వంతెనపై ఉన్న కాలువలోకి పంపుతుంది. ఈ లిఫ్ట్‌లో అయిదు లక్షల లీటర్ల నీరు నిల్వ ఉంటుంది. వీల్ ఎత్తు 45 మీటర్లు, చుట్టుకొలత 35 మీటర్లు, గ్లాస్గో నగరంవైపు ఉన్న క్లైడన్ పోర్త్ కెనాల్ కింద ఉంటుంది. ఎడింబరో వైపు ఉన్న యూనియన్ నది ఎత్తులో ఉంటుంది. వీటి ఎత్తులను పరిగణలోకి తీసుకుని 35 మీటర్ల ఎత్తులో దీన్ని నిర్మించారు. లిఫ్ట్ ద్వారా అడుగున ఉన్న పడవలను పై భాగంలో ఉన్న నదిలోకి మోసుకుని వెళ్లి జారవిడుస్తారు. పై భాగంలో వంతెనపై ఉన్న నీటి ద్వారా ఈ పడవలు యునియన్ నదిలోకి చేరతాయి. ఈ పడవలలో పర్యాటకులు ప్రయాణిస్తూ ప్రకృతి రమణీయ దృశ్యాలను తిలకించవచ్చు. పలు అందమైన ఆర్చీల కింద నుండి సాగే ఈ ప్రయాణంలో సొరంగ మార్గాల ద్వారా కూడా పడవలు దూసుకుని పోయి పర్యాటకుల్ని మైమరపింపజేస్తాయి. ఫాల్కిర్క్ వీల్‌ను 21వ శతాబ్దపు ఇంజినీరింగ్ వింతగా చెబుతారు. పైగా రోజూ ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని తిలకించడానికి వేలాదిగా పర్యాటకులు వస్తారు.

## రింగ్‌వార్ట్

నెదర్లాండ్స్‌లోని ఉత్తర హాలెండ్ ప్రావిన్స్‌లో వృత్తాకారంలో ప్రవహించే ఒక పెద్ద కాలువ పేరు రింగ్‌వార్ట్. దీన్ని రింగ్‌వార్ట్ ఆఫ్ ది హార్లెమ్మర్‌మీర్ పోల్డర్, రింగ్ కెనాల్ అని కూడా పిలుస్తారు. నెదర్లాండ్స్ హార్లెమ్మర్‌మీర్ చుట్టూ వృత్తాకారంలో ఈ నది నెలకొని ఉంది. హార్లెమ్మర్‌మీర్



పురపాలక సంఘ పరిధిలోకి వస్తుంది. డచ్ ఫర్ హార్లెమ్ సరస్సు నుండి 1839లో ఈ నదిని తవ్వడం ప్రారంభించారు. 1845లో ఈ కాల్వ నిర్మాణం పూర్తి చేశారు. ఈ కాలువ 61 కి.మీ. పొడవు, 2.4 మీటర్ల లోతులో నిర్మించారు. వాణిజ్య పడవలతో పాటు పర్యాటకులు ఉల్లాసంగా గడిపే వినోద పడవలు కూడా ఈ కాలువలో ప్రయాణిస్తాయి.

రింగ్‌వార్ట్ నది భూమిపై తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ పశ్చిమ నెదర్లాండ్స్‌లోని రోలోఫరెండ్స్‌వీన్ అనే పట్టణం వద్ద ఏ4 హైవేపై నిర్మించిన వంతెనపై నుండి ఈ నది నీటి ప్రయాణం కొనసాగించడం విశేషం. ఈ హైవేపై నిర్మించిన వంతెనను ఏ4 ఆక్విడక్ట్ అని పిలుస్తారు. 1961లో దీన్ని నిర్మించారు. 2006లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ మరమ్మతులు చేశారు. నీటి వంతెన పై భాగంలో నీరు ప్రయాణిస్తుంటే, అడుగు భాగంలో నిర్మించిన సొరంగ మార్గ రహదారుల ద్వారా వాహనాలు శరవేగంతో దూసుకుని వెళుతుంటాయి.

## పాంట్ డు సార్ట్ ఆక్విడక్ట్

దీన్ని స్టార్ కెనాల్ అని కూడా పట్టణానికి సమీపంలో ఉన్న కాలువ. 20.9 కి.మీ. పైబడి వున్న స్టార్ కెనాల్ నిమీ సమీపంలోని గ్రాండ్ లార్జ్ కృత్రిమ సరస్సును, సెనెఫ్స్ సమీపంలోని బ్రస్సెల్స్ చార్లెరోయ్ కాలువను అనుసంధానం చేస్తుంది. స్టార్ కెనాల్ ప్రవహించడానికి ఒక భారీ వంతెనను నిర్మించడం విశేషం. దీని పొడవు 498 మీటర్లు, వెడల్పు 46 మీటర్లు ఉంటుంది. ఇది యూరప్‌లోనే అద్భుతమైన ఇంజినీరింగ్ ప్రతిభకు తార్కాణంగా నిలుస్తుంది. ఎన్55, ఎన్ 535 జాతీయ రహదారుల మీద ఈ నీటి వంతెనను నిర్మించారు. ఈ నీటి వంతెన పైనుండి తిలకిస్తే నేలపై పాములా మెలికలు తిరిగిన జాతీయ రహదారులు సుందరంగా కనిపిస్తాయి. చుట్టుపక్కల ఉన్న పచ్చదనం రమణీయంగా కనిపిస్తుంది. 28 కాంక్రీట్ స్తంభాలు, 65 వేల టన్నుల బరువుతో నిర్మించిన ఈ వంతెనను పాంట్ డు సార్ట్ ఆక్విడక్ట్ అని పిలుస్తారు. ఈ నీటి వంతెనపై ఆధునిక వాణిజ్య నౌకలు కూడా ప్రయాణిస్తున్నాయి. 1998 నుండి 2002 వరకు నాలుగు సంవత్సరాల వ్యవధిలో దీన్ని నిర్మించారు. ప్రపంచ వ్యాప్తంగా వున్న పొడవైన వంతెనలలో ఇది ఒకటి. బెల్జియం జల రవాణా వ్యవస్థలో స్టార్ కెనాల్ కీలకమైన భూమికను నిర్వహిస్తుంది. ●



# దారి చూపే రామాయణం

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

**పదకొండు సెప్టెంబరు, 1893 రోజున చికాగోలో ప్రపంచ సర్వ మత సమావేశంలో హిందూ భారత హృదయాన్ని ఆవిష్కరించిన స్వామి వివేకానంద ప్రసంగం అంతే ప్రాధాన్యం పొందిన తేదీగా 22 జనవరి, 2024న అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ఠ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.**

అనాదిగా హిందువులను ఏకం చేసిన దారం, ప్రపంచ మత విశ్వాసాల సారం ఒక్కటే అనే బోధనల ఆధారం అన్నీ రామ తత్వమే, రామ రాజ్య సౌభాగ్యమే. 8000 యేండ్ల అత్యంత పురాతన నాగరికతను స్వంతం చేసుకున్న హిందుత్వం 'సర్వ మతాలకు అమ్మ(మదర్ ఆఫ్ ఆల్ రిలిజియన్స్)' లాంటిదని, బిలియన్ల జనాలను ఒక్క తాటిపై నిలిపిన శక్తివంతమైన సారం రామాయణం.

## రామతత్వం, రామ రాజ్య విలువల పునాదులు

ఇప్పుడు దాదాపు 300 రకాల రామాయణాలు అందుబాటులో ఉన్నప్పటికీ అన్నింటి సారం రామతత్వమే, రాముడి బోధనలే. పరమత సహనం, మత విభేదాలను తిరస్కరించిన మతం, ప్రజాభిప్రాయాన్ని గౌరవించడం, సహజీవన సౌందర్యాన్ని బోధించిన తత్వం, అన్ని మత బోధనల సారం, శాంతియుత సమాజ స్థాపన, న్యాయ పోరాటాలు, సమానత్వం సాధనలు, బలహీనులకు బాసట నిలవడం అంటూ చక్కగా ప్రచారం చేసింది రసరమ్య రామాయణం. పెద్దలను గౌరవించడం, తల్లిదండ్రుల్లో దైవాన్ని చూడడం, ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేయడం, అందరూ సమానమే అని నినదించడం, ఒర్పుకు పట్టం కట్టడం, ప్రేమను పంచడం, సంస్కృతి సంప్రదాయాలను గౌరవించడం, అన్నదమ్ముల అనుబంధం లాంటి విలువల ప్రాధాన్యాలను ఏకరువు పెట్టింది మన రామాయణం, శ్రీరాముడి జీవితం.

ప్రతి ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వగలిగిన హిందూమతం భారతాన్ని విశ్వ గురువును చేస్తూనే శ్రీరాముడి బోధనలకు కట్టుబడి నేటికీ నడుస్తున్న పౌర సమాజం భారత్‌లోనే కాకుండా పలు ప్రపంచ దేశాల్లో కూడా అమలు అవుతున్నది. ప్రపంచ దేశాలు విభేదాలను మరిచి సమస్యలకు సమాధానాలు వెతికి మానవీయ సమాజాన్ని



స్థాపించుకోవడానికి రామరాజ్య సిద్ధాంతాలు ఉపకరిస్తాయని ప్రపంచ మానవాళి నమ్ముతోంది. అభ్యుదయ భావాలు, ఏకత్వ ప్రయోజనాలు, కరుణామయ జీవన విధానాలు, కుటుంబ విలువలు, మానవీయ సంబంధాలు, శత్రువులో మిత్రుణ్ని చూడడం, సత్య ధర్మాలకు కట్టుబడి ఉండడం, శిష్టరక్షణ-దుష్టశిక్షణ చేసిన విధానం, మాట మీద నిలబడడం, క్షమాగుణాలు, స్నేహ బలాలు, మానవ సంబంధాలు మొదలైన పదాలకు ప్రయోగాత్మక, ఆచరణాత్మక రుజువులను చూపి విశ్వమానవాళికి దారిదీపంగా నిలుస్తున్నది.

## బాలరాముడి ప్రాణప్రతిష్ట

22 జనవరి, 2024న అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ట జరిగింది. ఐదు శతాబ్దాల కోరిక నిజ రూపం దాల్చిన రోజది.

## ఆధునిక వాటికన్ సిటీగా మారిన బాలరాముడి అయోధ్య

ఆధునిక వాటికన్ సిటీగా అవతరించిన అయోధ్య రామ మందిరం రానున్న వేల యేండ్లకు ప్రపంచానికే మార్గ నిర్దేశనం చేయడానికి ఉవ్విళ్లూరుతున్నది.

ముస్లిం మెజారిటీ కలిగిన ఇండోనేషియాలో రామ పూజలు, రామాయణ ప్రచారాలు జరుగుతూనే ఉన్నాయి. వాషింగ్టన్, న్యూయార్క్, ప్యారిస్, సిడ్నీ, లండన్ వీధులు సైతం రామ నామంతో ప్రతిధ్వనించాయి. యుద్ధాలు వద్దంటూనే పరమత సహనంతో శాంతి గొడుగుల కింద సంతోషకర సమాజం కొనసాగాలని బోధించిన రాముడి ప్రతి మాట జీవితాన్ని సన్మార్గంలో నడిపే మంత్రం అవుతున్నది. రామ రాజ్యమే ప్రపంచ దేశాల ముందున్న ఏకైక మార్గమని తెలుసుకొని విశ్వమానవాళి మానవీయ విలువలకు పట్టాభిషేకం చేస్తూ శాంతి కపోతాలు ప్రపంచమంతా స్వేచ్ఛగా ఎగిరే విధంగా నడుచుకుందాం.. ఆనందమయ జీవితాలను ఆస్వాదిద్దాం!

---

జోక్

### ఎప్పుడు తగ్గించాలి?

పేషెంట్: డాక్టర్‌గారూ! జబ్బు వివరాలతో పాటు నా ఆస్తి వివరాలు కూడా అడుగుతున్నారు.. ఎందుకు?

డాక్టర్: జబ్బు ఎప్పట్లోగా తగ్గించాలో నేను చూసుకోవాలి కదా!

పేషెంట్: ఆ....!

**- వైదా ఈశ్వరరావు,** విశాఖపట్నం

# ఈశాన్య గది అద్దెకు ఇవ్వవచ్చా?

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458

సి.కార్తిక్ - వరంగల్

ప్రశ్న: ఈశాన్యం గది అద్దెకు ఇచ్చాను. అద్దెకున్నవాళ్లు తాళం వేసి వుంచుతున్నారు. అందువల్ల మాకు ఏమైనా ఇబ్బందులుంటాయా?

**జవాబు:** ఈశాన్య గదికి అద్దెకు ఇవ్వకూడదు. అది మీరే వాడుకోవడం మంచిది. ముఖ్యంగా, పూజలకు, వ్రతాలకు, నోములకు చాలా మంచిది.

## నైరుతిలో మరుగుదొడ్డి?

కె.కాత్యాయని - గుంటూరు

ప్రశ్న: నైరుతిలో మూడు అడుగుల ఖాళీ స్థలం వుంది. అక్కడ మరుగుదొడ్డి నిర్మించవచ్చా? ఉత్తరం వైపు ఎనిమిది అడుగుల ఖాళీ స్థలంలో మెట్లు నిర్మించి దాని కింద భాగంలో మరుగుదొడ్డి, స్నానపు గది నిర్మించవచ్చా?



**జవాబు:** ఖాళీ స్థలంలో నైరుతి మూలలో మరుగుదొడ్డి, బాత్‌రూమ్ నిర్మించుకోవచ్చు. కానీ మీకు అక్కడ వున్నది మూడు అడుగుల స్థలమే కనుక ఇంటికి తగలకుండా ఏమీ నిర్మించుకోవడానికి వీలుపడదు. మెట్ల కింద కూడా నిర్మించకూడదు. మీ ఇంటికి తూర్పు కాంపౌండు గోడకు మధ్యన చాలా ఖాళీ స్థలం వుంది. దక్షిణ గోడను పారుగా చేసి లెట్రిన్ కట్టుకోవచ్చు. అయితే ఇంటికీ- లెట్రిన్‌కీ మధ్య ఖాళీ స్థలం కంటే- లెట్రిన్‌కీ-తూర్పు కాంపౌండు గోడకూ మధ్యనుండే ఖాళీ స్థలం ఎక్కువగా వుండాలి. అదేవిధంగా లెట్రిన్ ఇంటికి తగలకుండా కట్టుకోవాలి.

## స్థలం కలిసొస్తుందా?

వై.సుహాస్ - యాదాద్రి

ప్రశ్న: ఒక ఖాళీ స్థలం కొన్నాను. అది కొన్న తరువాత కోర్టుకు వెళ్లాల్సి వచ్చింది. స్థలం నాదేనని కోర్టు తీర్పు చెప్పింది. అయినా ఆ స్థలంలో ఇల్లు కట్టలేకపో యాను. అద్దె ఇంట్లోనే ఉంటున్నాను. వ్యాపారంలో అభివృద్ధి లేదు?

**జవాబు:** ఆ స్థలం వివరాలు మీరు పంపించలేదు. అదీగాక మీరు నివసిస్తున్న ఇంటి వాస్తు ప్రభావం వ్యాపారం మీద ఉంటుంది.

## వ్యాపారంలో నష్టాలు..?

బి.మల్లీశ్వరి - సూరారం

ప్రశ్న: ఏ వ్యాపారం చేసినా నష్టం వస్తోంది. ఆకస్మిక మరణాలు సంభవిస్తున్నాయి. మేం ఇంటి అద్దెల మీద ఆధారపడ్డాం.

**జవాబు:** నైరుతి పెంపు, నైరుతి మాత్రమే ఖాళీ స్థలం మొదలైన నైరుతి దోషాల వల్ల ఆ ఇంట్లో ఆకస్మిక మరణాలు, ఆ ఇంట్లో నివసించేవారికి ప్రమాదాలు జరగడం సర్వసాధారణం. మీ ఇంటికి పశ్చిమ నైరుతి పెరుగుదల వుండటమే కాక మొత్తం స్థలంలో ఎక్కడా ఖాళీ వదలకుండా ఇల్లు కట్టి, పెరిగిన ఆ నైరుతి భాగంలో మాత్రం కొంత ఖాళీ వదలి ఇంటిని ఆనుకుని వుండేలా బాత్రూమ్ నిర్మించారు. పెరిగిన నైరుతి భాగాన్ని విడగొట్టి పక్కవారికి అమ్మివేయటం మంచిది.

మీ ఇంటికి పశ్చిమంలో పొరుగువారి ఖాళీ స్థలం వుంది. మీ వాడకపు నీటిని ఆ ఖాళీ స్థలంలోకి వెళ్లకుండా జాగ్రత్త పడండి. ఖాళీ స్థలాన్ని మొత్తం ఆక్రమిస్తూ ఇల్లు కట్టారు. ఉత్తరం వైపున కిరాయికి ఇచ్చిన ఒక పోర్షను మొత్తం నిర్మూలించి ఆకాశానికి తెరిచి చేయడం వల్ల మీ ఇంటికి వున్న వాస్తుదోషాలు సవరించబడి వ్యాపారంలో నష్టాలు, ఆకస్మిక మరణాలు అరికట్టబడతాయి.

## వాస్తుప్రకారం లేకపోతే?

ఎ.శ్రీనాథ్ - శ్రీరంగాపురం

ప్రశ్న: ఒక కుటుంబం జీవితం, ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా వుండటానికి, కుటుంబ సభ్యుల మధ్య అన్యోన్యమైన ప్రేమానురాగాలకు వాస్తుకు ఏ విధమైన సంబంధం కలిగి ఉంటుంది? వాస్తుకు వ్యతిరేకంగా ఇంటి నిర్మాణం వుంటే పై విషయాలలో మార్పు ఎలా ఉంటుంది?

**జవాబు:** ఒక ఇంటి నిర్మాణంలో ఒక్క విషయం తెలపడం వల్ల వాస్తు పరిశీలన సంపూర్ణంగా విశ్లేషించబడదు. కనుక మీ ఇంటి నిర్మాణంలో ఏవో కొన్ని విషయాలు కాకుండా పూర్తిగా అన్ని విషయాలు తెలుసుకోవడం వలన చాలావరకు పరిశీలించవచ్చు. అందువల్ల మీ ఇల్లు వాస్తు నిపుణులకు చూపించడం మంచిది.

ఉత్తర ఈశాన్యం, పెంపుదల ఉత్తర, వాయవ్య, ఉత్తర, ఈశాన్య దోషాలు లేనప్పుడు ఆ ఇంట్లో ఆర్థిక పరమైన ఒడిదుడులు వుండే అవకాశం లేదు. అలాగని భార్యా భర్తల మధ్య అన్యోన్యానికి పట్టుగొమ్మ లాంటి ఆగ్నేయమూల తీసివేయడం వల్ల ఆ ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు లేనప్పటికీ అన్యోన్యత లోపిస్తుంది. ప్రహరీ గోడలకీ, ఇంటి గోడలకీ మధ్యన గేట్లు పెట్టడం వల్ల కుటుంబ సభ్యుల్లో అన్యోన్యత లోపిస్తుంది. ఆ ఇంటి లోపల వున్న నేలమట్టం మిద్ర, పల్లాలు, ఇంటి బయట వున్న వీధిపోట్లు, వెన్నుపోట్లు, ఇంట్లో నడక స్థానాలు మొదలయినవన్నీ ఆ ఇంటి సభ్యుల ప్రవర్తన మీద, ఆదాయ-వ్యయాల మీద, ఆరోగ్య సంపదల మీద ఫలితాలు చూపిస్తాయి.

ఒక వ్యక్తి దశ బాగుంటే సహజంగానే వాస్తు బాగున్న ఇంట్లో వుంటాడు. విధి బాగోలేక వాస్తు అవకతవకలున్న ఇంట్లో నివసిస్తూ అష్టకష్టాలు పడుతున్నవారి దశ తిరిగినప్పుడు ఆ ఇంటిని ఉచ్ఛస్థానంలో ఏదైనా కొత్త వీధిపోటు ఏర్పడటంగానీ, ఈశాన్యంలో అతని ప్రమేయం లేకుండా ఒక డ్రైనేజీకి గొయ్యి తవ్వడంగానీ ప్రకృతిసిద్ధమయిన బీభత్సం వల్ల ఆ ఇంటి వాయవ్య, ఈశాన్య ఆగ్నేయ మూతలు(వుంటే) కూలిపోవటంగానీ జరగడం వల్ల ఆ ఇంటికున్న వాస్తుదోషాలు పోయి యజమానికి తప్పక మంచి జరుగుతుంది.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



పనులలో విజయం సాధిస్తారు. అనుకోని ప్రయాణాలలో నూతన వ్యక్తులు పరిచయమై మిత్రులుగా మారతారు. ఇంటా బయటా ఎదురైన సమస్యలను అధిగమించి ముందుకు సాగుతారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చాలా అవసరం. ఉద్యోగాలలో ఒత్తిడులు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. పక్షులకి నీళ్లు పెట్టండి. రాజకీయాల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది.

## వృషభం



చిన్ననాటి మిత్రులను కలుసుకుని ఉల్లాసంగా గడుపుతారు. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు సాగిస్తారు. దీర్ఘకాలిక రుణాలు తీర్చి ఊరట చెందుతారు. మీ ఇష్ట దేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చేయండి. విపరీతమైన పనిఒత్తిడి వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి.

## మిథునం



కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు తీరి ఊరట చెందుతారు. శ్రమ మీది, ఫలితం వేరొకరిది అన్నట్లుగా ఉంటుంది. అనుకోని బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా పూర్తి చేస్తారు. చిరు వ్యాపారులకి బాగుంటుంది. నూతన వ్యాపారాలు మొదలు పెట్టాలన్న ఆలోచనలు ఫలించే సూచనలున్నాయి. లక్ష్మీతామర వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి.

## కర్కాటం



ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. సంఘంలో గౌరవం పొందుతారు. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగులకు ఉన్నత హోదా లభిస్తుంది. ఆర్థిక లావాదేవీలు బాగుంటాయి. మీ ఇష్టదేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చేయండి. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. సంఘసేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

## సింహం



మిత్రులతో ఏర్పడిన మాట పట్టింపులు తొలగుతాయి. ఆరోగ్యం, వాహనాల విషయాలలో జాగ్రత్తలు పాటించండి. దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. వ్యాపారులకు బాగుంటుంది. ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయి. కొత్త వ్యాపారాలు మొదలు పెట్టాలన్న ఆలోచనలు ఫలిస్తాయి. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి.

## కన్య



కొత్త పనులకు శ్రీకారం చుడతారు. ఆకస్మిక ధన లాభం. రాజకీయ, పారిశ్రామిక రంగాలలోని వారికి అనుకూలం. వృత్తి, వ్యాపారాలలో ముందడుగు వేస్తారు. ఉద్యోగస్తులకు పదోన్నతులు లభిస్తాయి. సమస్యలకు పరిష్కారాలు కనుగొంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. మీడియాలో వున్న వారికి అనుకూలం.

## తుల



సంఘంలో విశేష ఆదరణ లభిస్తుంది. పనులు చకచకా సాగుతాయి. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి. భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. రియల్ ఎస్టేట్ రంగంలో వున్నవారికి అనుకూలమైన సమయం. అయినవాళ్ల ఆరోగ్యం కోసం ఖర్చులు అధికమవుతాయి. నూతన విద్యల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. కోరుకున్న కళాశాలలో అడ్మిషన్ కోసం చేసే ప్రయత్నాలు చేసే ఫలిస్తాయి. పక్షులకి నీళ్లు పెట్టండి.

## వృశ్చికం



దీర్ఘకాలిక రుణాలు తీరి ఊరట చెందుతారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్య సమస్యలు తీరుతాయి. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. మీరు చేసే సిఫార్సులు కలిసి వస్తాయి. ఉద్యోగరీత్యా కొత్త ప్రాజెక్టు కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. హనుమాన్ ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఆ బొట్టు ధరించండి.

## ధనుస్సు



బాధ్యతలు పెరిగినా సకాలంలో నిర్వహిస్తారు. ముఖ్య వ్యవహారాలలో తొందరపాటు వద్దు. సన్నిహితుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. నూతన విద్యల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. కూరగాయలు, పండ్ల వ్యాపారులకి అనుకూలమైన సమయం. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి. కొత్త కళాశాలలో అడ్మిషన్ కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.

## మకరం



కుటుంబంలో శుభ కార్యాల ప్రస్తావన వస్తుంది. ఆర్థిక ప్రగతి సాధిస్తారు. సన్నిహితుల సలహాతో నూతన కార్యక్రమాలు చేపడతారు. పనుల్లో విజయం సాధిస్తారు. అనుకోని అవకాశాలు లభిస్తాయి. అష్టమూలికా తైలం, లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి. ఇతర భాషలు నేర్చుకోవాలన్న ప్రయత్నాలు ఫలిస్తాయి. కోరుకున్న కళాశాలలో అడ్మిషన్ లభిస్తుంది. మెడలో శ్రీ మేధా దక్షిణామూర్తి డాలరు ధరించండి.

## కుంభం




ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. పాత మిత్రులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. పారిశ్రామిక, రాజకీయ నాయకులు మంచి అవకాశాలు, ప్రయోజనాలు దక్కించుకుంటారు. కొంతమంది ప్రవర్తన, అలవాట్లు మీకు నచ్చకపోవచ్చు. అయినవాళ్లతో విరోధాలు ఏర్పడకుండా సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తారు. మెడలో కాలభైరవ రూపు ధరించండి.


## మీనం




పనులలో తొందరపాటు వద్దు. గృహ నిర్మాణ ఆలోచనలు చేస్తారు. ఇంటా, బయటా సమస్యలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. వృత్తి, వ్యాపారులు లాభాలు పొందుతారు. అష్టమూలికా తైలం, లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి. మీ ఆలోచనలు, ప్రణాళికలు మంచి ఫలితాలు అందజేస్తాయి. శత్రువర్గం నిర్వీర్యం అవటానికి మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. రాజకీయ నాయకుల అండదండలు లభిస్తాయి.

ఈ వారం కా'ర్టూన్స్'


ముందు..ఆ పక్క రూం లోకెళ్ళి.. మీరు ఎవరి భుజం పై తల ఆన్చి ఏడువాలి అనుకుంటారో.. వారిని తలుచుకుని.... తనివితీరా ఏడ్చి రండి....!!
-సైకియాట్రిస్ట్ & కౌన్సిలర్-
Zakir...


జస్ట్ కుక్కలా పిలవ్వడం లేదు నేను.. ఈ దేశ రక్షణ బాధ్యత నా భుజాలపైన ఉంది!!
Zakir...


నా కన్ను ఆప్రేషన్ తర్వాత కూడా నీ అందం కొంచెం కూడా పెరుగతదే?
Zakir...



ప్రపంచంలోని
అతి పెద్ద రెస్టారెంట్ ఇది.
చైనాలోని చాంగ్‌కింగ్ పట్టణంలో
వుంది. రెస్టారెంట్ మొత్తం కొండను
ఆక్రమించి వుండటం దీని ప్రత్యేకత.
పిపా యువాన్ హాట్ పాట్
రెస్టారెంట్‌గా పేరు
గాంచింది.

